


తెలుగు వార్త వార పత్రిక
RNI : APTEL/2006/16523

# సత్తెనపల్లి న్యూస్

సామాజిక హితం | ప్రజాప్రగతి

సంపుటి : 21 | సంచిక : 39 | 28.9.2026 నుంచి 4.10.2026 | పేజీలు : 8 | వెల రూ. 3 | sapnews.in@gmail.com |




- రాజుకున్న డీఎస్సీ వేడి
- రాజకీయ సవాళ్ల ఎపిసోడ్‌గా మారిన డీఎస్సీ వ్యవహారం
- శాప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత
- చర్చ ఎక్కడ? ఆధారాలు ఎక్కడ? సమాధానాలు ఎక్కడ?

# డీఎస్సీపై సవాళ్లు... ప్రతి సవాళ్లు!



**అమరావతి/విజయవాడ:** డీఎస్సీపై సవాళ్లు.. ప్రతిసవాళ్లు చాలానే వినిపించాయి. కానీ ఇప్పుడు ఆ సవాళ్లకు అసలు పరీక్ష ఎదురైంది. ఇంతకాలం మీడియా ముందుకొచ్చి ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకున్న నేతలు.. ఇప్పుడు ఆరోపణలు, ఆధారాలు, సమాధానాలు అన్నీ ఒకే చోట తేల్చుకునే పరిస్థితి వచ్చింది. అదే విజయవాడలోని శాప్ కార్యాలయం. “జగన్.. నీ తాడేపల్లి కొంపకు 200 మీటర్ల దూరంలో ఉన్నా. డీఎస్సీపై చర్చకు సిద్ధమా?” అంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన సవాల్ రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. డీఎస్సీపై చర్చకు రావాలని జగన్‌కు పలుమార్లు సవాల్ విసిరినట్లు లోకేశ్ స్వయంగా పేర్కొన్నారు. అటు స్పోర్ట్స్ కోటా అంశంలో శాప్ చైర్మన్ రవినాయుడు కూడా వైసీపీ ఆరోపణలను ఖండిస్తూ చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. దీనికి మాజీ మంత్రి పేర్ని నాని ప్రతిసవాల్ విసరడంతో.. డీఎస్సీ వ్యవహారం క్రమంగా రాజకీయ సవాళ్ల ఎపిసోడ్‌గా మారింది. కానీ అసలు ప్రశ్న మాత్రం ఒక్కటే. చర్చ ఎక్కడ? ఆధారాలు ఎక్కడ? సమాధానాలు ఎక్కడ?

## వెనక్కి తగ్గని వైసీపీ

వైసీపీ మాత్రం ఆరోపణలతో వెనక్కి తగ్గలేదు. మెగా డీఎస్సీ-2025లో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సోమవారం విజయవాడలోని శాప్ కార్యాలయం ఎదుట నిరసనకు పిలుపునిచ్చింది. స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఇదే సమయంలో పోలీసులు ఆ నిరసనకు అనుమతి నిరాకరించారు. శాప్ కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన వైసీపీ నేతలు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

## ఇక్కడే అసలు రాజకీయ పరీక్ష...

ఇప్పటివరకు “దమ్ముంటే చర్చకు రా” అనే సవాళ్లు మీడియాలో కనిపించాయి. కానీ ఇప్పుడు ఆరోపణలు చేస్తున్న పార్టీ నేతలు సంబంధిత సంస్థ కార్యాలయం వద్దకు వచ్చారు. వారి వద్ద ఆధారాలు ఉన్నాయని వారు చెబుతున్నారు. మరోవైపు ఆరోపణల్లో వాస్తవం లేదని అధికార పక్షం, శాప్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఆరోపణలు నిజమా? అబద్ధమా? అన్నది రాజకీయ నినాదాలతో తేలదు. రికార్డులు, ధ్రువపత్రాలు, ఎంపిక ప్రక్రియ, నిబంధనలు, మెరిట్ జాబితాలు, విచారణ వంటి అంశాలే దానికి సమాధానం చెప్పాలి. ఇప్పటికే స్పోర్ట్స్ కోటా వ్యవహారంపై వివాదం నేపథ్యంలో ఎంపికైన ఉపాధ్యాయులు కూడా తమపై వస్తున్న ఆరోపణలను ఖండించారు. తమ ఉద్యోగాలు ప్రతిభ ఆధారంగానే వచ్చాయని, నిరాధార ఆరోపణలు చేయొద్దని వారు కోరారు. అందుకే ఇప్పుడు శాప్ చైర్మన్ రవినాయుడిపై ఒక కీలక బాధ్యత పడింది. రాజకీయ వేదికపై సవాళ్లు విసరడం ఒక ఎత్తయితే.. సంస్థ అధిపతిగా ఆరోపణలకు పత్రాలు, నిబంధనలు, ప్రక్రియలతో సమాధానం ఇవ్వడం మరో ఎత్తు. వైసీపీ నేతలు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని చెబుతుంటే.. అవి ఏమిటో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత వారిపైనే ఉంటుంది. అదే సమయంలో ఆరోపణల్లో పస లేదని శాప్ చెబుతుంటే.. అది కూడా ప్రజలకు ఆధారాలతో వివరించాల్సిందే. ఎందుకంటే ఇది కేవలం టీడీపీ--వైసీపీ రాజకీయ పోరాటం కాదు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశం కూడా. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు అవసరం. ఆరోపణలు నిరాధారమైతే ఆ ఆరోపణలతో ప్రభావితమైన అభ్యర్థుల ప్రతిష్ఠను కాపాడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపైనే ఉంటుంది. ఇక “చర్చకు సిద్ధమా?” అనే ప్రశ్నలకు రాజకీయ సమాధానాల కంటే వాస్తవాలు, ఆధారాలు, అధికారిక రికార్డులే సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది.

## శాప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

మరోవైపు విజయవాడ నగరంలోని శాప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్లు, వైసీపీ నేతలు పోటాపోటీ నినాదాలు చేసుకున్నారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై వైసీపీ నేతలు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో వాటిని టీచర్లు ఖండిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో క్రీడల మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ ఛైర్మన్, ఎండీకి వినతిపత్రాలు అందజేసేందుకు శాప్ కార్యాలయం వద్దకు స్పోర్ట్స్ కోటా టీచర్లు వచ్చారు. అదే సమయంలో వైసీపీ నేతలు కార్యాలయం బయట బైఠాయించారు. డీఎస్సీలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీంతో ఇటు టీచర్లు, అటు వైసీపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. వైసీపీ నేతల ఆరోపణలను స్పోర్ట్స్ కోటా టీచర్లు తీవ్రంగా ఖండించారు. “తమ సర్టిఫికెట్లు, మెడళ్లు నిజమైనవి. ఇకనైనా వాస్తవాలు తెలుసుకుని నిందలు మానుకోవాలి. ఆరోపణలు చేసే వారికి ఆధారాలు చూపిస్తాం” అని టీచర్లు నినాదాలు చేశారు. మరోవైపు పోలీసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. దీంతో తోపులాట జరిగింది. నిరసన తెలుపుతున్న టీచర్ల వద్దకు శాప్ ఎండీ భరణి చేరుకుని వారితో మాట్లాడారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి జెండా ఎగరాలి




**సత్తెనపల్లి (ఎస్ఎపిఎన్):** సత్తెనపల్లి పట్టణంలోని రఘురామ్ నగర్ కార్యాలయంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి (టీడీపీ-జనసేన-బీజేపీ) అనుసరించాల్సిన వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని ఎలా బలపరచాలి, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ, ప్రచార ప్రణాళికలపై నాయకులకు ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. “రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. గ్రామ పంచాయతీ నుంచి జిల్లా పరిషత్ వరకు ప్రతి స్థానంలో కూటమి జయభేరి మోగించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం” అని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడిన ముఖ్య పాయింట్లు:రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు మన పార్టీకి, కూటమికి అత్యంత కీలకం. గ్రామ పంచాయతీ నుండి జిల్లా పరిషత్ వరకు ప్రతిచోటా కూటమి జెండా ఎగరాలి. గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను, ఇప్పుడు మన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, చేపడుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలి.అభ్యర్థుల ఎంపికలో నిజాయితీ, పార్టీ కోసం అంకితభావంతో కష్టపడే వారికే మొదటి ప్రాధాన్యత ఇస్తాం. నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తే స్థానిక సంస్థలను 100% క్లీన్ స్వీప్ చేస్తాం. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ తెదేపా, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉల్లం పలుకు

ఇరువురి బలం ఇరువురికి ఎరికే సన్నాయి నొక్కులెందుకు సవాళ్ళనొదిలి
ఎవరిబలం వారు తేల్చుకోవచ్చు కాని మీమాంస
స్థానికత్వం బలం, బలిమి నేటికీ ఎరగని గలాసుశబ్దానికి
సైకిల్ స్థిరత్వం కదులుద్దా లోకేసునికి సాల్వేషన్ సమస్యే కాదు ఎందుకంటే
మేకపోతు గాంభీర్యమే!”

**- ఉల్లం శేషగిరిరావు, అడ్వకేట్, హైకోర్టుడసామాజిక విశ్లేషకులు.**






## సాయికృష్ణ కేసు దర్యాప్తుపై సుప్రీం కోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేసు దర్యాప్తు విషయంలో ఏపీ ప్రభుత్వం, పోలీసుల తీరు పట్ల సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. విచారణను ఇక తామే చేపడతామని చెబుతూ.. ఏపీ హైకోర్టు విచారణపై స్టే విధిస్తూ తక్షణమే ఈ కేసును బదిలీ చేస్తున్నట్లు వెల్లడించింది. గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ వ్యవహారంపై వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి సుప్రీం కోర్టులో ఓ పిటిషన్ వేశారు. డీజీపీతో పాటు విజయవాడ సీపీలపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆ పిటిషన్‌లో కోరారు. బుధవారం జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌పై కీలక ఆదేశాలు జారీ చేసింది. సాయికృష్ణ కేసులో హైకోర్టు విచారణపై స్టే విధిస్తూ..ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. సెప్టెంబర్ 30లోపు సాయికృష్ణ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సీల్డ్ కవర్‌లో సమర్పించాలని ఆదేశించింది. హైకోర్టులోని ఈ కేసుకు సంబంధించిన అన్ని పిటిషన్లను, రికార్డులను తమకు బదిలీ చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. కేసు తదుపరి విచారణను అక్టోబర్ 12కు వాయిదా వేసింది. ఈ క్రమంలో సాయికృష్ణ కేసు దర్యాప్తు జరిగిన తీరును తీవ్రంగా తప్పుబట్టింది. ఏపీ డీజీపీపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "గాదె సాయి కృష్ణ తల్లి ఫిర్యాదు చేస్తే ఎందుకు ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేయలేదు?. డీజీపీ నిద్ర పోతున్నారా?. పోలీసు కస్టడీలో సాయికృష్ణ అదృశ్యం కావడం చట్టవిరుద్ధం. పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజ్ ధ్వంసం చేస్తే ఏసీపీ చూస్తూ కూర్చున్నారా?. మీ డ్యూటీ మీకు తెలియదా?. మీ తీరు ఘోరంగా ఉంది. సాయికృష్ణ మృతదేహం ఇప్పటిదాకా దొరకలేదంటే.. పోలీసుల దర్యాప్తు తీరు ఎంత ఆందోళనకరంగా ఉందో అర్థమవుతోంది" అంటూ ధర్మాసనం వ్యాఖ్యానించింది.

## భీమిలి బాధ్యతలు.. అనూషకు జగన్ దిశానిర్దేశం



**తాడేపల్లి:** భీమిలి అసెంబ్లీ నియోజక వర్గ సమన్వయకర్తగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బొత్స అనూష వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాల యంలో బుధవారం ఈ భేటీ జరిగింది. భీమిలి నియోజ కవర్గ సమన్వయకర్తగా బొత్స అనూషను నియమిస్తూ ఇటీవల వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జగన్‌ను కలిసిన అనూష.. తనపై నమ్మకం ఉంచి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

**పార్టీ బలోపేతంపై దృష్టి :** భీమిలి నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అనూష తెలిపారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భీమిలిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలతో సమన్వయం, పార్టీ సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై జగన్ అనూషకు పలు సూచనలు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## ప్రతి గడపకూ ఆరోగ్య సంరక్షణ.. ఆయుష్మాన్ భారత్‌పై మోదీ



**ఢిల్లీ :** ఆరోగ్యవంతమైన సమాజం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన పథకం ఆయు ష్మాన్ భారత్. ఈ పథకం ప్రారంభమై ఎనిమిదేళ్లు పూర్తైన సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఆయుష్మాన్ భారత్ కింద 60 కోట్ల మంది లబ్ధిదారులు ఏడాదికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా రక్షణను పొందుతున్నట్లు తెలిపారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ పథకంగా నిలిచిందని కొనియాడారు. ప్రతి గడపకూ ఆరోగ్య సంరక్షణ చేరుతుండడంతో.. క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ బలోపేతం అవుతోందన్నారు.

**48.54 కోట్ల ఆయుష్మాన్ కార్డుల జారీ..** ఆయుష్మాన్ భారత్ పథకం గురించి కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ.. ఇప్పటివరకు 48.54 కోట్ల మంది ప్రజలకు ఆయుష్మాన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న 39 వేలకు పైగా నమోదిత ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.2 లక్షల కోట్లకు పైగా విలువైన వైద్య సేవలు అందించామన్నారు. పెరుగుతున్న వైద్య ఖర్చుల భారం సామాన్య ప్రజలపై పడకుండా ఉండేందుకు.. సకాలంలో చికిత్స పొందేందుకు వీలుగా ప్రధాని మోదీ దార్శనికతతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధాని మోదీ 2018లో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఝార్ఖండ్‌లో ప్రారంభించారు.

# చంద్రబాబు వచ్చాకే తాగునీటి సమస్య

**విశాఖపట్నం :** గ్రేటర్ విశాఖపట్నం నేతలతో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ సమావేశమయ్యారు. దీనిలో పార్టీ సీనియర్ నేతలు బొత్స, కేకే రాజు, గుడివాడ అమర్నాథ్, సహా పలువురు నేతలు పాల్గొన్నారు. పార్టీ అభివృద్ధి, స్థానిక సమస్యలు సహా పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ విశాఖపట్నంలో మొట్టమొదటిసారిగా తాగడానికి నీళ్లు లేని పరిస్థితి వచ్చిందని, ఇంతవరకు ఎప్పుడూ లేని విధంగా విశాఖలో మూడు రోజులకు ఒకసారి తాగునీరు ఇచ్చే పరిస్థితి వచ్చిందని, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాతే విశాఖలో ఈ పరిస్థితి కనిపిస్తోందన్నారు. పోలవరం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం అందుబాటులో ఉంటే విశాఖతో పాటు ఉత్తరాంధ్రకు గ్రావిటీ ద్వారా నీళ్లు ఇవ్వగలమన్నారు. ఒకవైపు పోలవరంలో ఎత్తు తగ్గించి, 75 టీఎంసీల వరకు అదనపు నిల్వ సామర్థ్యాన్ని పోగొట్టుకుంటున్నారు. మరోవైపు విశాఖలో మూడు రోజులకు ఒకసారి నీళ్లు ఇచ్చే పరిస్థితి తీసుకొచ్చారని జగన్ పేర్కొన్నారు. విశాఖ భూముల విషయమై మాట్లాడుతూ రూపాయికి చాక్లెట్ వస్తుందో లేదో తెలియదు కానీ, విశాఖపట్నంలో మాత్రం 99 పైసలకు చంద్రబాబు తనకు కావాల్సిన వాళ్లకు భూములు ఇస్తున్నారు. రూ.5వేల కోట్ల విలువైన భూములను గీతం పేరుతో కబ్జా చేస్తున్నారు. విశాఖలో అత్యంత విలువైన భూములను తమకు నచ్చినవారికి ఇచ్చేసే స్థాయికి ఈ ప్రభుత్వం వెళ్లిపోయిందన్నారు.

### విశాఖ అభివృద్ధికి ఎంత చేశాం

తమ హయాంలో విశాఖ అభివృద్ధి గురించి జగన్ మాట్లాడుతూ మా ప్రభుత్వ హయాంలో విశాఖపట్నంలో లక్షా 30 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇళ్లు మంజూరు చేశాం. కేజీహెచ్‌ను అభివృద్ధి చేశాం. ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేశాం. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మూలపేట పోర్టు వరకు ఉత్తరాంధ్ర అభివృద్ధికి పునాదులు వేశాం. గూగుల్, అదానీ డేటా సెంటర్ వరకు ఉత్తరాంధ్రలో పెట్టుబడులు వచ్చేలా ముందుకు తీసుకెళ్లాం. ఉత్తరాంధ్రలో ఎక్కడ చూసినా మా ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి కనిపించిందన్నారు. ఉద్దానం కిడ్నీ సమస్య పరిష్కారానికి కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను తీసుకొచ్చాం. ఉద్దానం కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారంగా హిరమండలం నుంచి సర్ఫేస్ వాటర్‌ను తీసుకొచ్చామన్నారు. రూ.600 కోట్లకు పైగా ఖర్చు చేసి ఉద్దానం వరకు నీళ్లు తీసుకొచ్చామని, ట్రైబల్ యూనివర్సిటీ, ట్రైబల్ ఇంజినీరింగ్ కాలేజీ, మెడికల్ కాలేజీలను తీసుకొచ్చామని పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, మెడికల్ కాలేజీలు, నాడు--నేడు పనులతో ఉత్తరాంధ్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లామని అన్నారు.

### గంజాయి, మద్యాన్ని ప్రోత్సహిస్తున్నారు..

ఇప్పుడు ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో గంజాయితో పాటు మద్యం అందుబాటులోకి వచ్చిన పరిస్థితి కనిపిస్తోంది. ప్రతి వీధి చివర, గుడి పక్కన, బడి పక్కన కూడా గంజాయి, మద్యం అందుబాటులోకి వచ్చాయి. మా హయాంలో గ్రామస్థాయిలో మహిళా పోలీసులను ఏర్పాటు చేశామన్నారు. ఇలాంటి వ్యవహారాలు కనిపిస్తే వెంటనే రిపోర్టింగ్ జరిగే వ్యవస్థను ఏర్పాటు చేశాం. గంజాయి, మద్యం వంటి వాటిని అరికట్టే పరిస్థితి నుంచి ఇప్పుడు వాటిని ప్రోత్సహించే స్థాయికి తీసుకెళ్లారన్నారు. మా హయాంలో ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో మహిళా పోలీస్‌ను అందుబాటులో ఉంచాం. దిశ యాప్‌ను తీసుకొచ్చాం. మహిళకు సమస్య వస్తే ఫోన్ చేసినా, ఫోన్ షేక్ చేసినా వెంటనే పోలీసులు అందుబాటులోకి వచ్చే వ్యవస్థను ఏర్పాటు చేశాం. ఇప్పుడు ఆ వ్యవస్థ మొత్తం రివర్స్ గేర్‌లోకి వెళ్లిపోయిందని జగన్ పేర్కొన్నారు.



### పోలీసులు.. రాజకీయ వేధింపులు

ఈ ప్రభుత్వాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని జగన్ పేర్కొన్నారు. ప్రశ్నించిన వారిని అరెస్టులు చేస్తున్నారు. తప్పుడు సాక్ష్యాలతో వేధిస్తున్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాన్ని నడుపుతున్నారు. మా హయాంలో మేము ఏ రోజు పోలీసుల మీద ఆధారపడి రాజకీయాలు చేయలేదు. ఎన్నికలు గెలవడానికి పోలీసులను ఉపయోగించలేదు. మేము ఆధారపడింది ప్రజలకు చేసిన మంచిపైనే.మేము ధైర్యంగా బటన్లు నొక్కి ప్రజలకు మంచి చేశాం. ఇప్పుడు చంద్రబాబు డిపెండెన్స్ మొత్తం పోలీసుల మీదనే ఉందని జగన్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే విధంగా పోలీసులను ఉపయోగిస్తున్న పరిస్థితి కనిపిస్తోందని, పోలీసులకు నేను ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాను.. అన్యాయం చేయొద్దు. ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారో, ఆ తీర్పును స్వేచ్ఛగా ఇచ్చేలా మీరు సహకరించండి. మీ ధర్మం మీరు చేయండి. మీ టోపీ మీద ఉన్న సింహాలకు మాత్రమే తలవంచండి. చంద్రబాబుకు తలవంచొద్దు అని వైఎస్ జగన్ అన్నారు.

### డిజిటల్ డైరీలో నమోదు నమోదు చేయండి

మా కార్యకర్తలపై ఎక్కడ అన్యాయం జరిగినా వెంటనే డిజిటల్ డైరీలో నమోదు చేయండని జగన్ కోరారు.ఏ పోలీసు అన్యాయం చేశాడు? ఏ అధికారి అన్యాయం చేశాడు? వాళ్లు చేసిన పని ఏంటి? అన్నది వెంటనే నమోదు చేయండి. జరిగిన అన్యాయాన్ని మర్చిపోకముందే పూర్తి వివరాలతో డిజిటల్ డైరీలో ఎక్కించండి. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ డిజిటల్ డైరీని ఓపెన్ చేస్తాం. ఎవరు ఏమేం అన్యాయం చేశారో లెక్కలు తీస్తాం. చట్టం ఎలా పనిచేస్తుందో చూపిస్తాం.

### మా పాలన - ప్రస్తుత పాలన..

మా ఐదేళ్ల పాలనకు, ఇప్పుడు జరుగుతున్న పాలనకు మధ్య తేడా ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోందని, మా ఐదేళ్ల పాలనలో ఎప్పుడూ జరగని మార్పులు తీసుకొచ్చామని జగన్ పేర్కొన్నారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత తీసుకొచ్చేందుకు పని చేశామని, మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి 99 శాతం హామీలను అమలు చేశామన్నారు. చెప్పిన మాటను నిలబెట్టుకునే రాజకీయాలను తీసుకొచ్చామని జగన్ పేర్కొన్నారు.

### ప్రభుత్వ బడులను మెరుగ్గా తీర్చిదిద్దాం

ప్రభుత్వ బడులను ప్రైవేటు బడులకంటే మెరుగ్గా తీర్చిదిద్దామని, నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం తీసుకొచ్చాం. మూడో తరగతి నుంచే టోఫెల్‌ను తీసుకొచ్చామని జగన్ పేర్కొన్నారు. పిల్లలకు బైలింగ్వల్ టెక్స్ట్‌బుక్స్ ఇచ్చాం. ఆరో తరగతి నుంచి డిజిటల్ క్లాస్‌రూమ్స్‌ను తీసుకొచ్చామన్నారు. ఎనిమిదో తరగతి నుంచి పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చామని, ప్రభుత్వ బడుల్లో సీట్ల కోసం ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు అవసరమయ్యే స్థాయికి ప్రభుత్వ విద్యపై నమ్మకం తీసుకొచ్చామని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

### ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చాం

ఆరోగ్యశ్రీని సుమారు 1,000 ప్రొసీజర్ల నుంచి 3,300 ప్రొసీజర్లకు విస్తరించాం. పేదవాడికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందేలా ఆరోగ్యశ్రీని విస్తరించాం. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చాం. జీరో వేకెన్సీ పాలసీ తీసుకొచ్చి ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లను అందుబాటులో ఉంచాం. రాష్ట్రంలో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరతను 4 శాతం స్థాయికి తీసుకొచ్చామని వైఎస జగన్‌పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రమాణాలు ఉన్న మందులను అందుబాటులో ఉంచామని, గ్రామస్థాయికి విలేజ్ క్లినిక్స్‌ను తీసుకొచ్చాం. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను గ్రామస్థాయికి తీసుకెళ్లామన్నారు. ప్రతి మండలంలో రెండు పీహెచ్‌సీలు, ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉండేలా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. 104 వాహనాల ద్వారా డాక్టర్లు గ్రామాలకు వెళ్లి వైద్యం అందించే వ్యవస్థను తీసుకొచ్చామని జగన్ పేర్కొన్నారు.



# బాబు అప్పులు రూ.3,97,198 కోట్లు

**అమరావతి:** ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అప్పుల చిట్టాను రోజు రోజుకూ భారీగా పెంచేస్తున్నారు. కేవలం 27 నెలల పాలనలోనే రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేశారు. మంగళవారం రాష్ట్రప్రభుత్వ సెక్యూరిటీలు విక్రయించి మరో రూ.2,600 కోట్లు అప్పుచేశారు. దీంతో చంద్రబాబు చేసిన అప్పులు రూ.4 లక్షల కోట్లకు చేరువయ్యాయి. అప్పులు చేయడంలో సీఎం చంద్రబాబు సరికొత్త రికార్డు సృష్టించారు. గత ఐదేళ్ల తన రికార్డును తానే తిరగరాశారు. 2014-19 ఐదేళ్ల పాలనలో చంద్రబాబు సర్కారు రూ.2.49 లక్షల కోట్లు అప్పు చేసింది. ఇప్పుడు 27 నెలల పాలనలోనే తన పాత రికార్డును అధిగమించి ఏకంగా దాదాపు రూ.4 లక్షల కోట్లు అప్పు చేసింది. గతంలో ఏ రాష్ట్ర ప్రభుత్వాలు ఇంత తక్కువ వ్యవధిలో ఇంత పెద్ద ఎత్తున అప్పులు చేసిన దాఖలాలు లేవు.

**సెక్యూరిటీలు అమ్మేసి రూ.2,600 కోట్ల అప్పు..**

మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలను వేలంలో విక్రయించడం ద్వారా రూ.2,600 కోట్లు బడ్జెట్ అప్పు చంద్రబాబు సర్కారు చేసింది. దీంతో బడ్జెట్ అప్పులే రూ.2,24,537 కోట్లకు చేరాయి. ప్రభుత్వ గ్యారెంటీ ఇస్తూ కార్పొరేషన్ల పేరుతో చేసిన అప్పులు రూ.1,24,974 కోట్లకు చేరాయి. ఇక రాజధాని పేరుతో చేసిన అప్పులు రూ.47,687 కోట్లకు చేరాయి. దీంతో 27 నెలల్లోనే బాబు తన పాలనలో చేసిన అప్పులు దాదాపు నాలుగు లక్షల కోట్లకు చేరుతున్నాయి. మంగళవారం నాటికి చంద్రబాబు చేసిన అప్పులు మొత్తం రూ.3,97,198 కోట్లకు చేరాయి.

**అప్పుల కోసం జీవోల మీద జీవోలు..**

ఎన్నికల ముందు సంపదసృష్టి అంటూ గొప్ప కబుర్లు చెప్పారు. కానీఅప్పులు సృష్టించడంలో తనకు ఎవరూ సాటి లేరని నిరూపిస్తున్నారు. గత 27 నెలలుగా పరిపాలన సాగించడానికి అప్పులపైనే చంద్రబాబు ప్రధానంగా ఆధారపడ్డారు. బడ్జెట్ అప్పులే ఏడాదికి రూ.లక్ష కోట్లు చొప్పున చేసేస్తున్నారు. ఇది చాలదన్నట్లు గనులు, మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి మరీ అప్పులు చేస్తున్నారు. మరో పక్క కార్పొరేషన్ల పేరుతో దొరికిన చోటల్లా గ్యారెంటీలు ఇస్తూ అప్పులకు జీవోల మీద జీవోలు జారీ




చేస్తున్నారు. ఇంకో పక్క ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ పరం చేస్తున్నారు. కార్పొరేషన్ల పేరుతో అప్పులు చేయడానికి ప్రభుత్వ గ్యారెంటీలను ఎడా పెడా ఇచ్చేస్తున్నారు.

**ఇలాగైతే భవిష్యత్ అంధకారమేనంటున్న కాగ్...**

అప్పులతోనే గడిపే స్థితికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చంద్రబాబు దిగజార్చేశారు. 2024-25 ఆర్థిక ఏడాదిలో దేశంలోనే అత్యధికంగా చేబదుళ్ల అప్పులు చంద్రబాబు సర్కారు చేసిందని కాగ్ నివేదిక తెలిపింది. చేబదుళ్లకు కూడా ఏకంగా రూ.303 కోట్ల మేర వడ్డీ చెల్లించిందని, ఏడాదిలో 357 రోజులు అప్పులతోనే పాలన సాగించారని, ఇలా అయితే రాష్ట్ర భవిష్యత్ అంధకారమేనని కాగ్ హెచ్చరించింది. అయినా సరే లెక్క చేయకుండా దొరికిన చోటల్లా అప్పులు తేవడమే లక్ష్యంగా బాబు పాలన కొనసాగిస్తున్నారు.

అప్పులు చేయడం కోసం.. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ) పెరిగిందంటూ చంద్రబాబు ఊదరగొడుతున్నారు. జీఎస్‌డీపీకి తగినట్లు రాష్ట్ర ఆదాయం పెరగకపోవడం చూస్తుంటే అప్పులు చేయడం కోసం తప్పుడు గణాంకాలను చెబుతున్నారని స్పష్టం అవుతోంది. ఇబ్బడి ముబ్బడిగా తెస్తున్న అప్పులను.. ఆస్తులు సృష్టించే, ఆదాయం వచ్చే మార్గాలపై వెచ్చించకుండా ఎలాంటి ప్రతిఫలాన్ని ఇవ్వని రంగాలకు మళ్లించేస్తున్నారు. దీంతో రాష్ట్ర అప్పుల భారం పెరిగిపోతూ ఆస్తులు తరిగిపోతున్నాయి.

## వలంటీర్లను చంద్రబాబు మోసం చేశారు

**అమరావతి:** రాష్ట్రంలో 2.66 లక్షల మంది గ్రామ, వార్డు వలంటీర్ల కుటుంబాలను చంద్రబాబు ప్రభుత్వం నమ్మించి నిలువునా మోసం చేసిందని గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ దుయ్యబట్టింది. మంగళవారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన వలంటీర్ల సదస్సులో సంఘం అధ్యక్షుడు కుమార్ నాయక్, కార్యదర్శి డోలా స్వప్న మాట్లాడుతూ.. చంద్రబాబు కూటమి ప్రభుత్వం వలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి అధికారం చేపట్టిన రోజు నుంచి 26 నెలలుగా వలంటీర్లను విధులకు దూరంగా ఉంచినందున, ఈ కాలానికి యువతకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు వలంటీర్లు అడగకుండానే వేతనాలు రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు.. సీఎం అయ్యాక ఆ హామీ నెరవేర్చకపోవడం మోసమే అవుతుందని దుయ్యబట్టారు. వలంటీర్లు తన తమ్ముళ్లు, అక్క చెల్లెళ్లు లాంటి వారని, వారి ఉద్యోగాలు తీయబోమని, వారికి ఇచ్చే వేతనం రూ.5 వేలకు ఇంకో రూ.5 వేలు కలిపి ఇచ్చే మనస్తత్వం తనది అంటూ ఎన్నికల సమయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాటలు చెప్పారని, కానీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదని అన్నారు. వలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకొని ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా వినియోగించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పనిచేసిన 2.66 లక్షల మంది వలంటీర్లు ఆందోళన చేస్తారని, అసెంబ్లీని కూడా ముట్టడిస్తారని హెచ్చరించారు.

# పెయిన్ కిల్లర్లు, యాంటీబయోటిక్స్‌తో కిడ్నీలకు ముప్పు



**అమరావతి:** వైద్యుల సలహా లేకుండా పెయిన్‌కిల్లర్లు, యాంటీబయోటిక్స్ మోతాదుకు మించి వాడితే దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధులు (సీకేడీ) వచ్చే ప్రమాదం ఉందని కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీవో) హెచ్చరించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల ఔషధ నియంత్రణ పరిపాలన విభాగాలతోపాటు ఆసుపత్రులు, ఫార్మసీలు, వైద్య నిపుణులను అప్రమత్తం చేస్తూ భారత డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ (డీసీజీఐ) డాక్టర్ రాజీవ్ సింగ్ రఘువంశీ సర్క్యులర్ జారీ చేశారు. ఆసుపత్రుల్లో యాంటీబయోటిక్స్ వాడకంపై అంతర్గత సమీక్షలు నిర్వహించాలని, మెడికల్ షాపుల్లో రికార్డులను ఆకస్మికంగా తనిఖీ చేయాలని అన్ని రాష్ట్రాల ఔషధ నియంత్రణ అధికారులను ఆదేశించారు. పెయిన్‌కిల్లర్ల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. పెయిన్‌కిల్లర్లు, యాంటీబయోటిక్స్‌ను రిజిస్టర్డ్ వైద్యులు రాసిన ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల్లోని కౌంటర్లలో నేరుగా విక్రయించడం నేరమని సీడీఎస్‌సీవో పేర్కొంది. నిబంధనలు ఉల్లంఘించి ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మే ఫార్మసీలు, రిటెయిలర్లపై చర్యలు తప్పవని హెచ్చరించింది. విచ్చల విడిగా పెయిన్‌కిల్లర్లు, యాంటీబయోటిక్స్ వాడకంతో ఆరోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని సీడీఎస్‌సీవో హెచ్చరించింది. డాక్టర్ సలహా లేకుండా తరచూ, దీర్ఘకాలం పాటు పెయిన్‌కిల్లర్లు, యాంటీబయోటిక్స్ వాడొద్దని సీడీఎస్‌సీవో సూచించింది. జలుబు, ఫ్లూ వంటి సాధారణ వైరల్ ఇన్‌ఫెక్షన్లకు యాంటీబయోటిక్స్ పనిచేయవనిపేర్కొంది. గతంలో వాడగా మిగిలిన యాంటీబయోటిక్స్‌ను మళ్లీ వాడడం గానీ, ఇతరులకు ఇవ్వడం గానీ చేయవద్దని సూచించింది. వైద్యుల సూచనల మేరకు నిర్దేశిత కోర్సు మాత్రమే వాడాలని పేర్కొంది. కిడ్నీ వ్యాధులు, బీపీ, గుండె జబ్బులు ఉన్నవారు పెయిన్‌కిల్లర్లు వేసుకునే ముందు తప్పనిసరిగా వైద్యుల సూచనలు పాటించాలని సూచించింది. నొప్పి, జ్వరం తగ్గకుండా పదేపదే వస్తుంటే సొంతంగా మాత్రలు వేసుకోవడం ఆపేసి వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించింది.

## సమ్మె ఎఫెక్ట్.. ఆదివారం తెరుచుకోనున్న బ్యాంకులు

**అమరావతి :**బ్యాంకు యూనియన్ల సమ్మె నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు సమ్మె తలపెట్టిన నేపథ్యంలో ఆదివారం బ్యాంకు కార్యకలాపాలు నిర్వహించాలని కేంద్ర ఆర్థిక శాఖ, రిజర్వ్ బ్యాంక్ నిర్ణయించాయి. దీంతో ఈ నెల 27న బ్యాంకు శాఖలు తెరుచుకోనున్నాయి. సమ్మె నేపథ్యంలో బ్యాంకు వినియోగదారులకు, కస్టమర్లకు ఇబ్బందులు రాకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆర్థిక శాఖ ప్రకటించింది.సాధారణంగా నాలుగో శనివారం, ఆదివారం బ్యాంకులు పనిచేయవు. 28 నుంచి మూడు రోజుల సమ్మె నేపథ్యంలో మొత్తంగా ఐదు రోజుల పాటు బ్యాంకు సేవలకు విఘాతం కలగనుంది. ఈ క్రమంలో ఆదివారం బ్యాంకులు తెరిచేలా నిర్ణయం తీసుకున్నట్లు ఆర్థిక శాఖ తెలిపింది. ఆర్‌బీఐ కూడా అందుకు ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. దీంతో ప్రభుత్వరంగ బ్యాంకులతో పాటు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఆదివారం పనిచేయనున్నాయని ఆర్థిక శాఖ తెలిపింది. వారంలో అయిదు రోజుల పనిదినాల విధానం అమలు చేయాలనే ఒప్పందాన్ని ఆమోదించకపోవడంపై ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. 2024 మార్చిలో కుదిరిన ఒప్పందం ప్రకారం వారానికి అయిదు రోజులే పని చేసి, రోజుకు 40 నిమిషాలు అదనంగా పనిచేసేందుకు సిద్ధపడినా ప్రభుత్వం నుంచి ఆమోదం రాలేదు. దీంతోపాటు స్కేల్-4, ఆపై అధికారులకే ప్రత్యేకంగా పర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. సమ్మె ప్రభావం దృష్ట్యా ఎస్‌బీఐ సహా 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ వినియోగదారులకు సూచనలు జారీ చేశాయి. శాఖల్లో నేరుగా చేసే పనులకు ఆటంకం కలిగినా డిజిటల్ సర్వీసులు యథాతథంగా అందుబాటులో ఉంటాయని తమ ప్రకటనల్లో స్పష్టం చేశాయి. యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ యాప్‌లు, ఏటీఎం ద్వారా చేసే డిజిటల్ బదిలీలు కొనసాగుతాయి. బిల్లుల చెల్లింపులు, చిన్న మొత్తం బదిలీలకు వినియోగదారులు డిజిటల్ మార్గాలనే ఎంచుకోవాలని బ్యాంకులు సూచిస్తున్నాయి.

## విజయవాడ శాప్ కార్యాలయం ముట్టడికి బయల్దేరిన మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి అరెస్ట్



**బాపట్ల (ఎస్ఎపిఎన్):** డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో జరిగిన అక్రమాలకు నిరసనగా విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ చేపట్టిన ఆందోళనకు బయలుదేరిన మాజీ డిప్యూటీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ నేత కోన రఘుపతి ని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బాపట్ల మండలం చుండూరుపల్లి వద్ద ఆయన ప్రయాణిస్తున్న వాహనాన్ని అడ్డుకున్న పోలీసులు, ఆయనను అదుపులోకి తీసుకుని బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విజయవాడలో వైఎస్సార్‌సీపీ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి ఎలాంటి పోలీసు అనుమతులు లేవని, శాంతిభద్రతల దృష్ట్యానే ముందుజాగ్రత్త చర్యగా ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. మరోవైపు, డీఎస్సీ స్పోర్ట్స్ కోటా భర్తీ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయని వైఎస్సార్‌సీపీ ఆరోపిస్తోంది. అర్హులైన క్రీడాకారులకు అన్యాయం జరిగిందని, ఈ నియామకాలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది.

## ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌ను కలిసిన వైఎస్ జగన్



**సత్తెనపల్లి ప్రతినిధి (ఎస్ఎపిఎన్):** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విజయవాడలోని లోక్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. డీఎస్సీ--2025 నియామకాల్లో అక్రమాల ఆరోపణలు, ఇటీవల శాప్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులపై జరిగిన దాడి ఘటనలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన శాంతియుత ర్యాలీ సందర్భంగా జరిగిన ఘటనపై కూడా వైఎస్ జగన్ గవర్నర్‌కు వివరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ర్యాలీలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడి జరిగిందని, ఈ ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. అంతకుముందు మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశమైన వైఎస్ జగన్ డీఎస్సీ--2025 వ్యవహారంపై పార్టీ చేపట్టిన పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు. డీఎస్సీ వ్యవహారంపై న్యాయపరమైన, ప్రజా పోరాటాన్ని కొనసాగించాలని పార్టీ నాయకులకు వైఎస్ జగన్ సూచించారు. అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు సమస్యను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ నేతలు నిర్ణయించారు.

## రాజుపాలెం మండలంలో రోడ్డు ప్రమాదం



**సత్తెనపల్లి రూరల్ (ఎస్ ఏ పి ఎన్ )** రాజుపాలెం మండలంలోని పెద్దనెమలిపురి గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామంలోని సచివాలయం సమీపంలో ఉదయం సుమారు 4 గంటల సమయంలో ఓ లారీ అదుపుతప్పి బోల్తాపడింది.ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి డ్రైవర్‌ను లారీ నుంచి బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, డ్రైవర్ పరిస్థితిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.



# 33వ వార్డులో పర్యటించిన డాక్టర్ గజ్జల

### స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ ఢంకా మోగించాలి

**సత్తెనపల్లి ప్రతినిధి :** స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పిలుపునిచ్చారు. సత్తెనపల్లి పట్టణంలోని 33వ వార్డులో డాక్టర్ గజ్జల పర్యటించారు. ముందుగా అచ్చంపేట రోడ్డులోని శ్రీ ఓంకారేశ్వర స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం వార్డులో పర్యటిస్తూ స్థానికులు, కార్యకర్తలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యువతతో కూడా మాట్లాడి ఎన్నికలకు సంబంధించి పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం వార్డులోని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని డాక్టర్ గజ్జల తెలిపారు. పార్టీ కోసం కష్టకాలంలో పనిచేసిన ప్రతి కార్యకర్తను గుర్తుపెట్టుకుంటా



నని, రానున్న రోజుల్లో వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ ఢంకా మోగించడమే లక్ష్యంగా ప్రతి వార్డులో కార్యకర్తలతో కలిసి ముందుకు సాగుతామని డాక్టర్ గజ్జల పేర్కొన్నారు.

# అక్రమాలకు అడ్డాగా మారుతున్న డ్వాక్రా గ్రూపులు



**సత్తెనపల్లి (ఎస్ఎపిఎన్):** మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి తమ కాళ్లపై తాము నిలబడాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన డ్వాక్రా పొదుపు సంఘాలు ఎన్నో కుటుంబాలకు ఆర్థిక భరోసానిస్తున్నాయి. చిన్న మొత్తాల్లో పొదుపు చేసుకుంటూ అత్యవసర సమయాల్లో రుణాలు పొందుతూ మహిళల సాధికారతకు ఇవి తోడ్పడుతున్నాయి. అయితే, సత్తెనపల్లి పట్టణ పరిధిలోని కొన్ని పొదుపు సంఘాల్లో సభ్యుల సొమ్ము నిర్వహణపై తీవ్ర అనుమానాలు, విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**సభ్యులకు తెలియకుండానే నిధుల వినియోగం**

పట్టణంలోని కొన్ని గ్రూపుల్లో సభ్యులకు ఎలాంటి పూర్తిస్థాయి సమాచారం ఇవ్వకుండానే పొదుపు ఖాతాల్లోని నగదును నిర్వాహకులు వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాము ఎంత పొదుపు చేశాం గ్రూపు పేరిట ఎంత రుణం వచ్చింది ఇంకా ఎంత చెల్లించాలివడ్డీ లెక్కింపు ఏ విధంగా జరుగుతోంది అనే వివరాలను నిర్వాహకులు స్పష్టంగా తెలియజేయడం లేదని కొందరు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అజ్ఞానమే ఆసరాగా లెక్కల్లో మాయాజాలం**

డ్వాక్రా సంఘాల్లోని సభ్యుల్లో మెజారిటీ మహిళలు ఉన్నత విద్యావంతులు కాకపోవడంతో లెక్కలు, బ్యాంకు లావాదేవీలు, వడ్డీ వ్యాపార సంబంధిత అంశాలపై వారికి పూర్తి అవగాహన ఉండటం లేదు. ఇదే పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు గ్రూపు లీడర్లు, నిర్వాహకులు మహిళ అమాయకత్వాన్ని అడ్డుపెట్టుకుని ఖాతాల్లోని సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**అధికారులు స్పందించి విచారణ జరపాలి**

ఈ ఆరోపణల్లో ఎంతవరకు వాస్తవం ఉందనేది సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహిళల కష్టార్జితానికి ప్రతి రూపాయికి లెక్క ఉండేలా, పారదర్శకత పెరిగేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి సభ్యురాలికి వారి పొదుపు, రుణాలు, బాకీ నిల్వల వివరాలు తెలిసేలా పాస్‌బుక్‌లలో క్రమం తప్పకుండా నమోదు చేయాలని, రికార్డులను తనిఖీ చేసే వెసులుబాటు కల్పించాలని స్థానిక మహిళలు డిమాండ్ చేస్తున్నారు. సత్తెనపల్లి పట్టణంలో వెలుగుచూసిన ఈ ఆరోపణలపై వైక్యాప్ (వైకెపి/ ఆర్ పి ఆర్ ) మరియు మెప్మా అధికారులు తక్షణమే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, డ్వాక్రా మహిళల సొమ్ముకు రక్షణ కల్పించాలని సభ్యులు కోరుతున్నారు.

# పోలీసుల దౌర్జన్యానికి గురైన గౌతమ్ రెడ్డికి అండగా డాక్టర్ గజ్జల

**సత్తెనపల్లి ప్రతినిధి(ఎస్ఎపిఎన్):** అర్హులైన డీఎస్సీ అభ్యర్థులకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయవాడ ఎస్ఏపీ కార్యాలయం వద్ద చేపట్టిన శాంతియుత నిరసనపై పోలీసులు వ్యవహరించిన తీరుపై వైఎస్సార్సీపీ శ్రేణులు తీవ్రంగా స్పందించాయి. నిరసన కార్యక్రమంలో పోలీసుల చర్యలతో స్పృహ కోల్పోయిన నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకుడు పూనూరు గౌతమ్ రెడ్డి ప్రస్తుతం విజయవాడ రమేష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి హాస్పిటల్‌కు వెళ్లి గౌతమ్ రెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును అణచివేయడం సరికాదని, డీఎస్సీ అభ్యర్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని గజ్జల స్పష్టం చేశారు. అర్హత ఉన్నా ఉద్యోగం దక్కని అభ్యర్థుల గొంతుకను అణచివేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదని, వారి న్యాయం కోసం వైఎస్సార్సీపీ ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటుందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. నిరసనలను అణచివేయడం కాకుండా డీఎస్సీ అభ్యర్థుల సమస్యలపై ప్రభుత్వం సమాధానం

**అర్హులైన డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం**



చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్సీపీ అండగా ఉంటుందని, అణచివేత ఎంత పెరిగినా ప్రజా సమస్యలపై పోరాటం ఆగదని పార్టీ శ్రేణులు స్పష్టం చేశాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ, వార్డు స్థాయిల నాయకులు, పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వెల్లటూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన



**వినుకొండ/బొల్లాపల్లి(ఎస్ ఏపి ఎన్ ):** బొల్లాపల్లి మండలం వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యలో భాగంగా 'ఐటీ టిటీఈఎస్' ట్రేడ్ చదువుతున్న 9, 10 తరగతుల విద్యార్థులకు బుధవారం పారిశ్రామిక సందర్శన (ఇండస్ట్రియల్ విజిట్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వినుకొండలోని 'వివేక కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్'ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్స్టిట్యూట్‌శ్రీ ప్రతినిధులు విద్యార్థులకు కంప్యూటర్ విద్య, డేటా ఎంట్రీ, కీబోర్డ్ నైపుణ్యాలు, ఇంటర్నెట్ వినియోగం, సాఫ్ట్‌వేర్ మరియు కార్యాలయ నిర్వహణ వంటి కీలక అంశాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. అలాగే కంప్యూటర్ల వినియోగం, వివిధ రకాల సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు మరియు ఐటీ రంగంలో భవిష్యత్తులో లభించే ఉద్యోగావకాశాల గురించి కూలంకషంగా వివరించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తితో వివిధ కంప్యూటర్ కార్యకలాపాలను పరిశీలించి, తమ సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు.

ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జి ఉపాధ్యాయులు సైదా మాట్లాడుతూ.. "తరగతి గదిలో నేర్చుకున్న సైద్ధాంతిక అంశాలను ఇలా ప్రత్యక్షంగా పరిశీలించడం వల్ల విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్, డిజిటల్ స్కిల్స్ పెరుగుతాయి. ఇటువంటి పారిశ్రామిక సందర్శనలు విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా భవిష్యత్తులో ఐటీ రంగంలో మంచి అవకాశాలను అందుకోవడానికి ఎంతగానో దోహదపడతాయి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రతాప్, చంద్రజిత్తు యాదవ్, రత్నకుమార్, అంజిబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు శివతో పాటు ఇతర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తప్పు జరిగిందని ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా?"



**సత్తెనపల్లి ప్రతినిధి (ఎస్ ఎ పి ఎన్ ):** డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా? అని సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి పేర్కొన్నారు. అర్హులకు అన్యాయం జరిగిందని నిలదీస్తే కేసులు పెడతారా? విద్యాశాఖలో జరిగిన వ్యవహారాలపై బాధ్యత వహించాల్సిన మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తే తప్పా? ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరమా? అన్యాయంపై గొంతెత్తడం నేరమా? అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని అడగడం నేరమా? డీఎస్సీ వ్యవహారంపై న్యాయం కోరుతూ నిరసన తెలిపిన వారిని అడ్డుకోవడం, అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య హక్కులపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అర్ధరాత్రి మహిళలను భయభ్రాంతులకు గురిచేసే పరిస్థితులు ఎందుకు? ప్రశ్నించే గొంతులను అణచివేయడమే పాలనగా భావిస్తున్నారా? ఇది ప్రజాస్వామ్య పాలనా? లేక "రెడ్ బుక్" పాలనా? ప్రశ్నించే ప్రతి గొంతుకూ సమాధానం చెప్పాల్సిందే. అక్రమాలపై విచారణ జరపాల్సిందే. అర్హులకు న్యాయం చేయాల్సిందే. ప్రజల గొంతును అరెస్టు చేయలేరు. న్యాయం కోసం వినిపించే ప్రశ్నను అణచివేయలేరు!

## డీఎస్సీ అక్రమాలపై ప్రశ్నించినందుకు వేధింపులా..?



**సత్తెనపల్లి ప్రతినిధి (ఎస్ఎపిఎన్) :** డీఎస్సీ వ్యవహారంలో అక్రమాలు జరిగాయని, అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ ప్రజల తరఫున ప్రశ్నిస్తూ విజయవాడ ఎస్ఏపీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టిన సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డికి పల్నాడు జిల్లా వైఎస్సార్సీపీ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి మద్దతు ప్రకటించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, అర్హులకు జరిగిన అన్యాయంపై గళమెత్తడం ప్రజాస్వామ్యంలో ప్రతి రాజకీయ పార్టీకి, ప్రజా ప్రతినిధికి ఉన్న హక్కు అని ఆమె పేర్కొన్నారు. అయితే డీఎస్సీ అంశంపై నిరసన తెలిపిన నేపథ్యంలో అర్ధరాత్రి సమయంలో పోలీసుల చర్యల కారణంగా గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి కుటుంబ సభ్యులు ఇబ్బందులు, భయాందోళనలకు గురయ్యారని చెబుతున్న ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. "డీఎస్సీలో జరిగిన అక్రమాలపై ప్రశ్నిస్తే కేసులా..? ప్రజల తరఫున నిలబడితే వేధింపులా..? ఒక ప్రజా సమస్యపై నిరసన తెలిపినందుకు కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసం..?" అని డాక్టర్ గీతా హాసంతి ప్రశ్నించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే నాయకులను భయపెట్టడం ద్వారా ప్రశ్నించే గొంతుకలను అణిచివేయాలని చూస్తే వైఎస్సార్సీపీ శ్రేణులు చూస్తూ ఊరుకోవని ఆమె స్పష్టం చేశారు. డీఎస్సీ అంశంలో అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరగాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని, నిరుద్యోగ యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా న్యాయం, పారదర్శకత కోణంలో ప్రభుత్వం పరిశీలించాలని ఆమె కోరారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతి గొంతుకకు వైఎస్సార్సీపీ అండగా ఉంటుందని, డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని డాక్టర్ గీతా హాసంతి తెలిపారు. డీఎస్సీ అక్రమాలపై ప్రశ్నించినందుకు భయపడేది లేదని, అర్హులకు న్యాయం జరిగే వరకు ప్రజల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని వైఎస్సార్సీపీ నాయకులు పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతును అణిచివేయడం కాదు.. ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలి. అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలి అనే డిమాండ్‌ను వారు ముందుకు తీసుకొచ్చారు. డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డికి అండగా డాక్టర్ గీతా హాసంతి. డీఎస్సీ బాధిత అభ్యర్థులకు న్యాయం చేయాలన్నదే డిమాండ్. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకకు వైఎస్సార్సీపీ అండ అని నినదించారు.

## డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డిపై దాడినిఖండించిన వైసీపీ సీనియర్ నాయకుడు చల్లంచర్ల సాంబశివరావు



**నరసరావుపేట(ఎస్ ఎ పి ఎన్ ):** సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి పై జరిగిన దాడిని, ఆయన నివాసం మరియు ఆసుపత్రిలో పోలీసులు నిర్వహించిన సోదాలను వైసీపీ సీనియర్ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారం శాశ్వతం కాదు:అధికారాన్ని అడ్డం పెట్టుకుని అర్ధరాత్రి వేళల్లో ఇళ్లలో తనిఖీలు నిర్వహించడం ఏమాత్రం సరికాదని మండిపడ్డారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న నాయకులు 'అధికారం శాశ్వతం కాదు' అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. గత పాలనను గుర్తుచేస్తూ:గత ఐదేళ్ల తమ వైసీపీ పాలనా కాలంలో ప్రత్యర్థులపై ఇలాంటి కక్షసాధింపు చర్యలకు ఎప్పుడూ పాల్పడలేదని ఆయన స్పష్టం చేశారు. రోగులకు భయాందోళన:నరసరావుపేటలోని సుధీర్ భార్గవ్ రెడ్డి నివాసంతో పాటు ఆసుపత్రిలో కూడా పోలీసులు అర్ధరాత్రి వేళల్లో తనిఖీలు చేయడం వల్ల ఆయన కుటుంబ సభ్యులతో పాటు, అక్కడ చికిత్స పొందుతున్న రోగులు తీవ్ర భయాందోళనకు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ కేసులు చెల్లవు: శాంతియుత వాతావరణంలో నిరసనలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేయడం, వారిపై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, ఇప్పటికైనా అధికార యంత్రాంగం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు స్వస్తి పలకాలని చల్లంచర్ల సాంబశివరావు డిమాండ్ చేశారు.

# స్థానిక ఎన్నికలే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలి

- మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- శావల్యాపురంలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం
- ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండా బలంగా ఎగరాలిలిలి
- హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం

**శావల్యాపురం (ఎస్ ఏ పీ ఎన్ ):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ప్రతి పార్టీ కార్యకర్త పట్టుదలతో పనిచేయాలని, ప్రతి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా బలంగా ఎగరాలని వైఎస్సార్‌సీపీ ౹రాజ మెంబర్, వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పిలుపునిచ్చారు. శావల్యాపురం మండలంలో ఆయన ఆధ్వర్యంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన పోరాటాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ హయాంలో శావల్యాపురం మండలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని



తెలిపారు. "మా పాలనలో ప్రజలకు చేసిన మంచి పనులే పార్టీకి నిజమైన బలం. చేసిన మేలును ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారు. ఆ నమ్మకంతోనే ధైర్యంగా ప్రతి గ్రామానికి, ప్రతి గడపకూ వెళ్తాం" అని ఆయన పేర్కొన్నారు.

**కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని బొల్లా విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకడంతో సామాన్యులు జీవించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వినుకొండ ప్రస్తుత ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అభివృద్ధి పనులు పక్కనపెట్టి శిలాఫలకాలకే పరిమితమయ్యారని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

**ప్రశ్నిస్తే దాడులా? భయపడేదే లేదు!**

డీఎస్సీ సమస్యలపై ప్రశ్నించిన ప్రతిపక్షాలపై అధికార పార్టీ నేతలు దాడులకు పాల్పడటం దుర్మార్గమని బొల్లా మండిపడ్డారు. రాజకీయంగా ఎదుర్కోలేక అక్రమ కేసులు, దాడులతో భయపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. తనపై అక్రమ కేసులు పెట్టి 14 రోజులు రిమాండ్‌కు పంపినా, తాను ఎలాంటి తప్పు చేయలేదని, ఏ ఒత్తిళ్లకూ లొంగేది లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధిస్తున్న పోలీసులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టులో ప్రైవేట్ కేసులు వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమం చివరలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సమావేశంలో మండల వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు పార్టీ నాయకుడు పాల్గొన్నారు.

## కొఠారి అంజనిబాయ్ భౌతికకాయానికి నివాళులర్పించిన డాక్టర్ కోడెల శివరామ్



**నరసరావుపేట(ఎస్ ఏ పి ఎన్) :** నరసరావుపేట పట్టణానికి చెందిన రిటైర్డ్ రిజిస్ట్రార్ కొఠారి శివాజీ సతీమణి కొఠారి అంజనిబాయ్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ కోడెల శివరామ్, నరసరావుపేటలోని వారి నివాసానికి వెళ్లారు. అంజనిబాయ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి డాక్టర్ కోడెల శివరామ్ అంజలి ఘటించారు. అనంతరం కొఠారి శివాజీతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అంజనిబాయ్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు.

## విద్యావికాసం

### పిల్లలపై మొబైల్ ఫోన్ మీడియా ప్రభావం

**డైరెక్టర్, పవిత్ర ట్యూషన్ సెంటర్, ఇరుకుపాలెం**




నేటి కాలంలో మొబైల్ ఫోన్ పిల్లలకు విద్య, సమాచారం మరియు వినోదానికి ఉపయోగపడే సాధనంగా మారింది. అయితే మొబైల్‌ను అవసరానికి మించి ఉపయోగించడం వల్ల పిల్లలపై ప్రతికూల ప్రభావాలు కలగవచ్చు. అధికంగా మొబైల్ ఉపయోగించడం వల్ల చదువుపై ఆసక్తి తగ్గడం, ఏకాగ్రత తగ్గడం, జ్ఞాపకశక్తిపై ప్రభావం పడటం, నిద్ర సరిగా లేకపోవడం వంటి సమస్యలు రావచ్చు. ఎక్కువ సమయం గేమ్స్, సోషల్ మీడియా మరియు వీడియోల్లో గడపడం వల్ల పుస్తకాలు చదవడం, బయట ఆటలు ఆడడం, కుటుంబ సభ్యులతో మాట్లాడడం వంటి మంచి అలవాట్లు తగ్గిపోవచ్చు. అందుకే పిల్లలు మొబైల్ ఫోన్‌ను అవసరమైనప్పుడు మాత్రమే, ముఖ్యంగా విద్యా ప్రయోజనాల కోసం, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సూచనలతో ఉపయోగించాలి. మొబైల్ మనకు ఉపయోగపడే సాధనం కావాలి కానీ మన సమయాన్ని నియంత్రించే అలవాటుగా మారకూడదు. "మొబైల్‌ను మనం ఉపయోగించాలి... మొబైల్ మనల్ని ఉపయోగించకూడదు."

## న్యాయ నేత్రం

### ఆడవారికి అస్త్రం

**షేక్ జానీ ఖాజావలి M.Com, LL.B., న్యాయవాది, 9441085206**



నేడు స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలకు చట్ట పరంగా రక్షణాత్మకశీగా ఉపయోగ పడే చట్టాలు ఉన్నాయి. ముఖ్యంగా BNSS 144 సెక్షన్ ఉంది. గతంలో CrPC 125 సెక్షన్ గా ఉండేది. స్త్రీలకు, మైనర్ పిల్లలకు, తల్లి దండ్రులకు ఉపయోగకరంగా ఉంటుంది. భర్త నుండి భార్య కు, తండ్రి నుండి పిల్లలకు, పిల్లల నుండి తల్లిదండ్రుల కు, భార్య పిల్లల ను వదిలివేసిన భర్త నుండి రోజు వారీ ఖర్చులకు గాను, మరియు శాశ్వత మనోవర్తి గా కోర్టుల నుండి భరణం పొందే హక్కు వీరికి ఉంది. భార్య కు కొన్ని ఇతర కండీషన్స్, ప్రభుత్వ ఉద్యోగి గా ఉన్న ప్పుడు ఈ చట్టం వర్తించదు.

## జీవనవేదం

**శిఖా శాంసన్, ఆరోగ్య విస్తరణ అధికారి, phc క్రోసూరు, 9849066412**



వర్షాకాలంలో కలుషిత నీటి ద్వారా మరియు దోమల ద్వారా వచ్చే వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలి. క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలి. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలి. నీటి కలుషితం ద్వారా టైఫాయిడ్, నీళ్ల విరోచనాలు సంభవిస్తాయి. ఎప్పుడు వేడి పదార్థములను భుజించవలెను నిల్వ పదార్థములను తినకూడదు. దోమల ద్వారా డెంగ్యూ మలేరియా చికెన్ గునియా మెదడువాపు బోదకాలు వ్యాధులు వ్యాపిస్తాయి దోమలు అభివృద్ధి చెందకుండా ఇంటి బయట ఇంటి లోపల నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి. దోమల కొట్టకుండా శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు వాడాలి దోమతెరలు వాడాలి కిటికీలకు తలుపులకు మెష్ లూ ఉపయోగించాలి


## డాక్యుమెంట్ మిస్సింగ్

**తుమ్మపూడి తిరుపతిరెడ్డి అనే నేను ఊటుకూరు గ్రామం, క్రోసూరు మండలం, పల్నాడు జిల్లాలో నివాసం ఉంటున్నాము. దస్తావేజులు చూపించుకుందామని ఊటుకూరు నుండి నర్సరావుపేటకు బైక్ పై బయలుదేరాను, మార్గం మద్యలో బైక్ ఆపి చూడగా సంభందిత దస్తావేజు లు కనిపిచలేదు.**

**డాక్యుమెంట్ వివరములు...** **మా తండ్రి గారు అయిన తుమ్మపూడి వెంకటశీతారామిరెడ్డిగారు తండ్రి లక్ష్మి రెడ్డి గారికి సంభందించిన దస్తావేజు లు పోయినాయి.**

**నర్సరావుపేట, లింగంగుంట్ల అగ్రహారం, వినుకొండ రోడ్ సర్వే నంబర్ 53/A, దస్తావేజు నంబర్ 477/1981. ఈ భూమి నర్రెద్దుల వెంకటరెడ్డి 1.92 భూమి లో మాకు సంభందించిన 242చ.గ.ల భూమికి సంబందించిన దస్తావేజులు పోయినాయి. సదరు ఈ దస్తావేజు లు ఎవరికైనా దొరికితే నా ఈ నంబర్ కి ఫొన్ చేయగలరు. 8978061629**

**ఇట్లు**

**శీతారామిరెడ్డి గారి కుమారులు తుమ్మపూడి వెంకటేశ్వరరెడ్డి, తుమ్మపూడి శ్రీనివాసరెడ్డి, తుమ్మపూడి తిరుపతిరెడ్డి...**


# బీసీ రిజర్వేషన్ల చరిత్రలో సెప్టెంబర్ 23కు ప్రత్యేక స్థానం

**1970లో G.O.Ms.No.1793 జారీ.. సామాజిక న్యాయానికి కీలక అడుగు.**

**సత్తెనపల్లి ప్రతినిధి (ఎస్ ఎ పి ఎన్):** బీసీ రిజర్వేషన్ల చరిత్రలో సెప్టెంబర్ 23వ తేదీకి ప్రత్యేక స్థానం ఉంది. 1970 సెప్టెంబర్ 23న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం G.O.Ms.No.1793ను జారీ చేసి, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు విద్యా సంస్థలు, ప్రభుత్వ సేవల్లో రిజర్వేషన్లకు సంబంధించిన కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో బీసీ వర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాల దిశగా ఒక ముఖ్యమైన అడుగు పడింది.

అప్పటి ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి హయాంలో బీసీల సామాజిక, విద్యా పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 1968 ఏప్రిల్ 12న +.వా.చీశీ.870 ద్వారా ఏర్పాటు చేసిన ఈ కమిషన్ వెనుకబడిన తరగతులను గుర్తించడంతో పాటు వారికి విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం, ఇతర ప్రత్యేక సదుపాయాలపై సిఫారసులు చేయాల్సిన బాధ్యతను చేపట్టింది. కమిషన్ 1970 జూన్ 20న తన నివేదికను సమర్పించింది. వెనుకబడిన తరగతులను నాలుగు గ్రూపులుగా విభజించి, విద్యా సంస్థలు, ప్రభుత్వ సేవల్లో రిజర్వేషన్లు కల్పించాలని సిఫారసు చేసింది. అనంతరం ప్రభుత్వం సిఫారసులను పరిశీలించి 1970 సెప్టెంబర్ 23న G.O.Ms.No. 1793ను జారీ చేసింది. కమిషన్ సిఫారసు చేసిన 30 శాతానికి బదులుగా ప్రభుత్వం 25 శాతం రిజర్వేషన్లను నిర్ణయించింది. ఈ నిర్ణయం బీసీ వర్గాల విద్యా, ఉద్యోగ అవకాశాలకు ఒక ముఖ్యమైన పునాదిగా నిలిచింది. తరతరాలుగా విద్య, ఉద్యోగాలు, పాలనా వ్యవస్థలో తగిన ప్రాతినిధ్యం లేని అనేక కుటుంబాలకు రిజర్వేషన్ విధానం ద్వారా కొత్త అవకాశాలు ఏర్పడ్డాయి. బీసీ వర్గాల సామాజిక, విద్యా అభివృద్ధి కోసం సాగిన దీర్ఘకాలిక పోరాటంలో ఈ నిర్ణయం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

రిజర్వేషన్లు కేవలం ఒక ప్రభుత్వ ఉత్తర్వు మాత్రమే కాకుండా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించే విధానంలో కీలక సాధనంగా మారాయి. నేడు బీసీ వర్గాల నుంచి ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రజా జీవితంలోని వివిధ రంగాల్లో ముందుకు వస్తున్న వారి ప్రయాణంలో ఇలాంటి చారిత్రాత్మక నిర్ణయాలకు ప్రాధాన్యత ఉంది.

1970 సెప్టెంబర్ 23న జారీ చేసిన G.O.Ms.No.1793ను స్మరించుకుంటూ, బీసీల సామాజిక, విద్యా, ఆర్థిక అభివృద్ధికి దోహదపడిన చారిత్రాత్మక నిర్ణయాన్ని గుర్తు చేసుకోవాలని పలువురు పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల చరిత్రలో కీలక పాత్ర పోషించిన అప్పటి ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

# గాదె సాయికృష్ణ కేసులో సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం!

**విజయవాడ లాకప్‌డెత్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు.. విచారణ తీరుపై తీవ్ర ప్రశ్నలు**



**సత్తెనపల్లి ప్రతినిధి (ఎస్ ఎ పి ఎన్ ):** విజయవాడలో గాదె సాయికృష్ణ మృతికి సంబంధించిన కస్టోడియల్ డెత్ కేసు మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. ఈ కేసులో పోలీసుల దర్యాప్తు తీరుపై ఇప్పటికే పలు ప్రశ్నలు తలెత్తగా, సాయికృష్ణ మృతదేహం ఆచూకీ తెలియకపోవడం, కీలకమైన సీసీటీవీ ఫుటేజ్‌కు సంబంధించి ఆరోపణలు ఉండటం వంటి అంశాలు వ్యవహారాన్ని మరింత తీవ్రతరం చేశాయి. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రికార్డుల్లోనూ సాయికృష్ణ మృతదేహం ఆచూకీ తెలియకపోవడం, సంబంధిత కాలానికి చెందిన సీసీటీవీ ఫుటేజ్ మిస్సయినట్లు తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయని నమోదు చేసింది. ఈ కేసులో సుప్రీంకోర్టు కూడా విచారణ సందర్భంగా పలు కీలక అంశాలను పరిశీలించింది. కేసుకు సంబంధించిన పోలీసు అధికారిపై ఇప్పటికే ఎఫ్‌ఐఆర్ నమోదు కాగా, దర్యాప్తు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, శాస్త్రీయ పద్ధతిలో సాగాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజ్, వీడియో రికార్డింగులను అసలు రూపంలో భద్రపరచాలని కూడా ఆదేశించింది. ఇక సాయికృష్ణ కుటుంబం మొదటి నుంచీ లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానాలు ఎక్కడ? ఫిర్యాదులపై సకాలంలో చర్యలు ఎందుకు తీసుకోలేదు? పోలీసుల అదుపులోకి వెళ్లిన వ్యక్తి పరిస్థితి ఏమైందన్న ప్రశ్నకు ఇప్పటికీ పూర్తి సమాధానం ఎందుకు లేదు? కీలకమైన సీసీటీవీ ఆధారాల విషయంలో ఇలాంటి ఆరోపణలు ఎలా వచ్చాయి? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**"మీ డ్యూటీ మీకు తెలియదా?"** : చట్టాన్ని కాపాడాల్సిన వ్యవస్థపైనే ఇలాంటి ప్రశ్నలు రావడం ఆందోళనకర పరిణామం. మృతదేహం ఆచూకీపై స్పష్టత లేకపోవడం, సీసీటీవీ ఫుటేజ్‌పై ఆరోపణలు రావడం వంటి అంశాలు దర్యాప్తు విశ్వసనీయతపై సహజంగానే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఇదే నేపథ్యంలో ఈ కేసులో నిజానిజాలు పూర్తిగా వెలుగులోకి రావాలంటే ప్రతి ఆధారాన్ని భద్రపరచి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే డిమాండ్ వినిపిస్తోంది. సాయికృష్ణ కుటుంబానికి న్యాయం జరగాలంటే నిజం బయటకు రావాలి.. ఆధారాలు భద్రంగా ఉండాలి.. బాధ్యులు ఎవరు అన్నది చట్టం ముందు తేలాలి. ఇది ఒక్క కుటుంబానికి సంబంధించిన ప్రశ్న కాదు. పోలీసుల అదుపులో జరిగిన మరణంపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత వ్యవస్థపై ఉంది.

# మున్సిపాలిటీలపై మరో భారీ భారం?

**సత్తెనపల్లి ప్రతినిధి (ఎస్ ఎ పి ఎన్):** స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ మున్సిపాలిటీల్లో భారీగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హాపీ) విధానాన్ని ప్రతిపాదించడం చర్చనీయాంశంగా మారింది. ఈ విధానం ద్వారా రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో సుమారు 11,860 కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. పట్టణాల్లో రహదారులు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి అవసరమే అయినప్పటికీ.. ఈ పనులకు అయ్యే వ్యయాన్ని భవిష్యత్‌లో మున్సిపాలిటీలు ఏ విధంగా భరించనున్నాయనే అంశంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో ప్రాజెక్టు వ్యయంలో కొంత మొత్తాన్ని ప్రభుత్వం లేదా సంబంధిత స్థానిక సంస్థ సమకూర్చుతుంది. మిగిలిన మొత్తాన్ని ప్రైవేటు సంస్థ ముందుగా పెట్టుబడిగా పెట్టి పనులను చేపడుతుంది. అనంతరం ఒప్పందంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం నిర్ణీత కాలంలో ఆ మొత్తాన్ని ప్రభుత్వం లేదా సంబంధిత సంస్థ చెల్లిస్తుంది.

మున్సిపాలిటీల విషయంలో ఈ విధానం అమలు చేస్తే వాటి ప్రస్తుత ఆదాయ పరిస్థితి, భవిష్యత్‌లో చేయాల్సిన చెల్లింపులు, వడ్డీ తదితర అంశాలు కీలకంగా మారనున్నాయి.

ఇప్పటికే పలు మున్సిపాలిటీలు పరిమిత ఆదాయ వనరులతోనే తమ రోజువారీ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో దీర్ఘకాలిక చెల్లింపుల బాధ్యతలు పెరిగితే స్థానిక సంస్థల ఆర్థిక పరిస్థితిపై ప్రభావం పడే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మరోవైపు, భవిష్యత్‌లో ఈ చెల్లింపుల కోసం అదనపు ఆదాయ వనరులను సమకూర్చుకోవాల్సి వస్తే ఆస్తిపన్నులు, యూజర్ ఛార్జీలు లేదా ఇతర రుసుములపై ప్రభావం ఉంటుందా అన్నది కూడా చర్చకు వస్తోంది.

మున్సిపాలిటీలకు వచ్చే ఆదాయంలో కొంత భాగం దీర్ఘకాలిక ప్రాజెక్టుల చెల్లింపులకు వెళ్లాల్సి వస్తే.. పారిశుధ్యం, చెత్త సేకరణ, డ్రైనేజీ నిర్వహణ, రహదారుల మరమ్మతులు వంటి రోజువారీ అవసరాలకు నిధుల లభ్యతపై ప్రభావం పడుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.




అందుకే హామ్ కింద చేపట్టే ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం వ్యయం ఎంత? మున్సిపాలిటీ వాటా ఎంత? ప్రైవేటు సంస్థ పెట్టుబడి ఎంత? తిరిగి చెల్లింపులు ఎన్ని సంవత్సరాలు చేయాలి? వడ్డీ, ఇతర చార్జీలు ఎంత? చివరకు స్థానిక సంస్థపై పడే మొత్తం ఆర్థిక బాధ్యత ఎంత? అనే వివరాలను స్పష్టంగా వెల్లడించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

అభివృద్ధి పనులు చేపట్టడం అవసరమే అయినా.. వాటి కోసం తీసుకునే ఆర్థిక నిర్ణయాలు మున్సిపాలిటీల భవిష్యత్ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉంది. ఎన్నికల సమయంలో పనుల ప్రకటనలకే పరిమితం కాకుండా, వాటి ఆర్థిక భారం, చెల్లింపు విధానం, దీర్ఘకాలిక ప్రయోజనాలపై ప్రజలకు పూర్తి వివరాలు అందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అభివృద్ధి జరగాలి.. అదే సమయంలో మున్సిపాలిటీల ఆర్థిక స్థిరత్వం కూడా కాపాడాలి.

# బీసీ రక్షణ చట్టం తెస్తామంటూనే.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు అన్యాయమేనా?

**సత్తెనపల్లి ప్రతినిధి (ఎస్ ఎ పి ఎన్ ):** ఒకవైపు బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని ప్రకటిస్తూ... మరోవైపు అదే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు విద్యా అవకాశాల్లో అన్యాయం జరుగుతోందనే ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎంబీబీఎస్ ప్రవేశాల్లో జీవో-102 అమలుపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

అత్యుత్తమ ర్యాంకులు సాధించిన రిజర్వేషన్ వర్గాల విద్యార్థులు తమ ప్రతిభ ఆధారంగా ఓపెన్ కేటగిరీకి అర్హత సాధించినప్పటికీ, వారిని రిజర్వేషన్ కేటగిరీలోనే పరిగణిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ విధానం వల్ల ఒక విద్యార్థికి మాత్రమే కాకుండా, అదే సామాజిక వర్గానికి చెందిన మరో అర్హత కలిగిన విద్యార్థి అవకాశానికి కూడా నష్టం కలుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఒక బీసీ, ఎస్సీ, ఎస్టీ లేదా ఇతర రిజర్వేషన్ వర్గానికి చెందిన విద్యార్థి తన ప్రతిభతో ఓపెన్ కేటగిరీ సీటుకు అర్హత సాధిస్తే, అతనికి ఆ సీటును ఓపెన్ మెరిట్‌లో కేటాయిస్తే అతని కేటగిరీలోని రిజర్వేషన్ సీటు మరో అర్హత కలిగిన విద్యార్థికి అందుబాటులో ఉంటుంది. అంటే ఒక విద్యార్థి తన ప్రతిభతో ముందుకు వెళ్లడంతో పాటు, అదే వర్గంలోని మరో విద్యార్థికి కూడా అవకాశం కల్పించినట్టవుతుంది. కానీ మెరిట్‌తో ఓపెన్ కేటగిరీకి అర్హత సాధించిన విద్యార్థినే రిజర్వేషన్ సీటులో లెక్కిస్తే... ఆ రిజర్వేషన్ సీటు మరో అర్హుడికి దక్కే అవకాశం తగ్గుతుంది. ఫలితంగా రిజర్వేషన్ వర్గాల మధ్యే పోటీ పెరిగి, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన జీవో--151 ప్రకారం కౌన్సెలింగ్‌లో ముందుగా మెరిట్ ఆధారంగా ఓపెన్ కేటగిరీ సీట్లను భర్తీ చేసి, అనంతరం రిజర్వేషన్ కేటగిరీ సీట్లను భర్తీ చేసే విధానం ఉండేదని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ విధానం వల్ల రిజర్వేషన్ వర్గానికి చెందిన విద్యార్థి తన ప్రతిభతో ఓపెన్ కేటగిరీలో సీటు పొందడంతో పాటు, అతని సామాజిక వర్గానికి కేటాయించిన రిజర్వేషన్ సీటు మరో అర్హుడికి దక్కే అవకాశం ఉండేది. ఇప్పుడు జీవో-102 ద్వారా ఈ విధానంలో మార్పులు వచ్చాయని, దాని ప్రభావం రిజర్వేషన్ వర్గాల విద్యార్థులపై పడుతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఇలాంటి అంశాల్లో ప్రభుత్వం మరింత స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఒక మెడికల్ సీటు అంటే కేవలం ఒక సీటు కాదు. అది ఒక విద్యార్థి సంవత్సరాల కష్టానికి, ఒక కుటుంబం పెట్టుకున్న ఆశలకు, ఒక పేద కుటుంబం భవిష్యత్తుకు సంబంధించిన విషయం. బీసీ రక్షణ చట్టం గురించి మాట్లాడటం మాత్రమే కాదు... బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు విద్యా అవకాశాల్లో న్యాయం జరిగేలా చూడటం కూడా సామాజిక న్యాయంలో భాగమే. అందుకే విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని జీవో-102పై సమగ్ర సమీక్ష చేయాలి. మెరిట్ ఆధారంగా ఓపెన్ కేటగిరీలో అర్హత సాధించిన విద్యార్థులకు న్యాయమైన అవకాశం కల్పించడంతో పాటు, అదే వర్గంలోని ఇతర అర్హులైన విద్యార్థులకు రిజర్వేషన్ ప్రయోజనం అందేలా నిబంధనలను స్పష్టంగా అమలు చేయాలి.సామాజిక న్యాయం మాటల్లో కాదు... విద్య, ఉద్యోగం, అవకాశాల్లో ఆచరణలో కనిపించాలి. విద్యార్థుల భవిష్యత్తుపై రాజకీయ ప్రయోగాలు కాదు... న్యాయమైన విధానాలు కావాలి.






## పోషకాహారంతో ఆరోగ్యకర సమాజం

**క్రోసూరు (ఎస్ ఎ పి ఎన్ ):** పోషకాహార లోపాన్ని నివారించి, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, తల్లులు మరియు చిన్నారులు పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలని వైద్యాధికారులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ మేరీ శ్రీకళ ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 9వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా, పల్నాడు జిల్లా క్రోసూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అనంతవరం అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం పోషణ మాసోత్సవం ఘనంగా జరిగింది. ఈ ముఖ్య అతిథులుగా హాజరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు మాట్లాడుతున్నారు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, ఇంటి వద్ద తీసుకోవాల్సిన సమతుల ఆహారంపై అవగాహన కల్పించారు.అంగన్‌వాడీల్లో అందించే వేడి భోజన విధానం, ఇంటి వద్ద తల్లులు పాటించాల్సిన పోషక విలువల ప్రాధాన్యతను వివరించారు. మిల్లెట్స్, ఆకుకూరల వాడకం తప్పనిసరి. చిరుధాన్యాల విశిష్టత: రాగులు, సజ్జలు, జొన్నలు మిల్లెట్స్‌తో వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసి తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్‌ని అందించారు. ప్రభుత్వం పౌష్టికాహారాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.పూర్ణాదేవిమాట్లాడుతూ.. రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, పప్పుధాన్యాలు, మిల్లెట్లు ఉండేలా చూసుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందించే ఐరన్ టాబ్లెట్లను ఖచ్చితంగా వాడాలని సూచించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషకాహారానికి సంబంధించిన కాయగూరలు, ఆకుకూరలు, వివిధ రకాల మిల్లెట్స్‌తోపోషణ ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు బి. జయలక్ష్మి, ప్రసన్న, పబ్లిక్ హెల్త్ నర్సు సంపూర్ణాదేవి, ఆరోగ్య పర్యవేక్షకురాలు లక్ష్మీ కుమారి, ఆశా కార్యకర్తలు బ్రహ్మేశ్వరి, భారతి, శ్యామల, అలాగే గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

## పల్నాడు జిల్లా నూతన ఎస్పీగా జగదీష్ ఆదహళ్లి బాధ్యతల స్వీకరణ



**నరసరావుపేట(ఎస్ ఎ పి ఎన్ ):** పల్నాడు జిల్లా నూతన (ఎస్పీ)గా జగదీష్ ఆదహళ్లి గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎస్పీ సిబ్బందితో ప్రత్యేక పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రస్తుత శాంతిభద్రతల పరిస్థితి, పోలీసు శాఖ పనితీరు, నమోదవుతున్న నేరాల సరళిపై అధికారులతో సమీక్షించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ ఆదహళ్లి మాట్లాడుతూ. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల సమర్థవంతమైన నియంత్రణ మరియు ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంపొందించాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, నరసరావుపేట డి.ఎస్.పి యం. హనుమంతరావు, సత్తెనపల్లి డి.ఎస్.పి చైతన్య , గురజాల డి.ఎస్.పి మహేశ్వరరావు,ఏ ఆర్ డి.ఎస్.పి .గాంధీ రెడ్డి, ఆర్ ఐ లు,సీఐలు, ఎస్ఐలు నూతన ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థుల భద్రతే ప్రథమ కర్తవ్యం




**సత్తెనపల్లి (ఎస్ ఎ పి ఎన్ ):** స్కూలు, కాలేజీ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థుల క్షేమమే అత్యంత ముఖ్యమని, డ్రైవర్లు ఎల్లవేళలా అప్రమత్తంగా వాహనాలను నడపాలని పిడుగురాళ్ల మోటార్ వాహనాల తనిఖీ అధికారి (బ్రేక్ ఇన్‌స్పెక్టర్) సి.హెచ్. రాంబాబు పిలుపునిచ్చారు. సత్తెనపల్లి పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. రాంబాబు సారథ్యంలో స్కూల్, కాలేజీ బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది డ్రైవర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్రేక్ ఇన్స్పెక్టర్ రాంబాబు చేసిన ముఖ్య సూచనలు:అటెండర్ తప్పనిసరి:ప్రతి స్కూలు, కాలేజీ బస్సులో డ్రైవర్‌తో పాటు విద్యార్థుల సంరక్షణ కోసం ఒక అటెండర్ తప్పనిసరిగా ఉండాలి.

ఎమర్జెన్సీ ఎగ్జిట్ ఖాళీగా ఉండాలి: అత్యవసర ద్వారాల వద్ద వాహనం స్టెపినీ టైర్లు లేదా ఇతర వస్తువులను అడ్డుగా ఉంచకూడదు.

ఫస్ట్ ఎయిడ్ కిట్: ప్రతి బస్సులో ప్రథమ చికిత్స సామగ్రి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా యాజమాన్యాలు, డ్రైవర్లు చూసుకోవాలి.

రోడ్డు నిబంధనల పాటించాల్సిందే:విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలి. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల మోటార్ వాహనాల తనిఖీ అధికారి (బ్రేక్ ఇన్‌స్పెక్టర్) సి.హెచ్. రాంబాబుతో పాటు ఏ.ఎం.వి.ఐ. నాగేశ్వరరావు, సత్తెనపల్లి పట్టణ ఏఎస్ఐ యన్.వి. రామారావు, సత్తెనపల్లి రూరల్ ఏఎస్ఐ కె. వెంకటేశ్వర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## యంగ్ స్టర్స్ హెల్పింగ్ సర్వీసెస్ ట్రస్ట్ 13వ వార్షికోత్సవం



**నరసరావుపేట(ఎస్ ఏ పి ఎన్ ) :** పట్టణంలో శ్రీ వనమా పవన్ సారథ్యంలో నిర్వహిస్తున్న 'యంగ్‌స్టర్స్ హెల్పింగ్ సర్వీసెస్ ట్రస్ట్' 13వ వార్షికోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శ్రీ వినాయక చతుర్దశ మంగళహారతి పూజా కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ప్రముఖ నాయకులు డాక్టర్ కోడెల శివరామ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడెల శివరామ్ భక్తులతో కలిసి విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మంగళహారతి పూజా కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. వార్షికోత్సవం వేళ భగవంతుని దివ్య ఆశీస్సులు పొందడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. గడిచిన 13 ఏళ్లుగా యంగ్‌స్టర్స్ హెల్పింగ్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమాజానికి అందిస్తున్న పలు సేవలను, సేవా కార్యక్రమాలను ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఈ ట్రస్ట్ మరిన్ని మంచి సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజాదరణ పొందాలని ఆకాంక్షించారు. ఈ ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు, సభ్యులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో యువత మరియు భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

## ఆర్యవైశ్య సంఘం పల్నాడు జిల్లా మీడియా కమిటీ చైర్మన్‌గా చిట్టిప్రోలు ఆంజనేయులు



**పిడుగురాళ్ల, (ఎస్ ఏ పి ఎన్ ) :** పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం మీడియా కమిటీ చైర్మన్ గా చిటిప్రోలు ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చశీదోలు సూర్యప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి జూలకంటి సురేష్ ఆంజనేయులు ను ఎన్నిక చేసారు. పల్నాడు జిల్లా మండల కేంద్రమైన మాచవరం గ్రామానికి చెందిన చిట్టి ప్రోలు ఆంజనేయులు గత 35 ఏళ్లకు పైగా ఈనాడు దినపత్రికతో పాటు పలు పత్రికల్లో విలేకరిగా పనిచేశారు. గత కొన్నేళ్లుగా (వాట్సాప్ గ్రూప్స్) ఏపీ హైలెట్స్ సీఈవోగా, మ్యాప్ న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్ గా ఉన్నారు. ఈనెల 27వ తేదీన నరసరావుపేట ప్రకాష్ నగర్ లోని ఏవన్ కన్వెన్షన్ సెంటర్ నందు జరగనున్న ప్రమాణ స్వీకారంలో నూతన కార్యవర్గంతో పాటు ఆంజనేయులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ, తనకు పదవి నిచ్చిన ఆర్యవైశ్య ప్రముఖులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్యవైశ్య మీడియా, తోటి మిత్రులందరికీ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా ఆంజనేయులు తెలిపారు. 27వ తేదీన నరసరావుపేటలో జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జిల్లాలోని మీడియా మిత్రులంతా హాజరుకావాలని ఆంజనేయులు కోరారు.

## పిల్లల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా నేషనల్ డి వార్మింగ్ డే



**క్రోసూర్ (ఎస్ ఏ పి ఎన్ ):** పిల్లల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా 'నేషనల్ డి వార్మింగ్ డే' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యులు అనిల్ కుమార్, శ్రీకళ మరియు ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ తెలిపారు. శుక్రవారం డి వార్మింగ్ డే సందర్భంగా వారు దొడ్లేరు, అనంతవరంలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలలను సందర్శించి కార్యక్రమ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్వయంగా ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. అలాగే పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ.. 25వ తేదీన ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోని పిల్లలకు వచ్చే అక్టోబర్ 5వ తేదీన మాత్రలు వేస్తామని తెలియజేశారు. నులిపురుగుల నిర్మూలన ద్వారా పిల్లలకు కలిగే ప్రయోజనాలను ఈ సందర్భంగా వివరించారు. ఆల్బెండజోల్ టాబ్లెట్లు మింగడం వల్ల పిల్లలలో రక్తహీనత నివారించబడుతుందని, శరీరంలో పోషకాల గ్రాహ్యత మెరుగుపడుతుందని తెలిపారు. ఇది పిల్లల చదువుపై ఏకాగ్రతను, నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. అలాగే ఈ టాబ్లెట్లు వేసుకోవడం ద్వారా పరిసరాలలో నులిపురుగుల వ్యాప్తిని తగ్గించి సమాజానికి మేలు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని జోస్ మేరీ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని పాపులమ్మలతో పాటు మండలంలోని ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరపాలెంలో విషాద



**బాపట్ల బ్యూరో (ఎస్. ఎ. పి. ఎన్ ) :** బాపట్ల మండలం చెరువు ఉప్పరపాలెం ఉప్పరపాలెంలో విషాద సంఘటన చోటు చేసుతుంది. తెగిపడిన విద్యుత్ ఘాతుకానికి గురై తల్లి కుమారుడు చనిపోయారు. వీరు ఉప్పరపాలెం వాసులు గా గురించారు. ఈ సంఘటనతో ఊరిలో విషాదం అలుముకుంది. సమాచారం అందు కున్న విద్యుత్ అధికారులు పోలీస్ సిబ్బంది సంఘటనా చేరుకొని పరిశీలిస్తున్నారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సంఘటన పై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 174 మందిలబ్ధిదారులకు గృహ మంజూరు పత్రాల పంపిణీ

**సత్తెనపల్లి (ఎస్ఎ పిఎన్):** సత్తెనపల్లి పట్టణంలోని రఘురామ్ నగర్ ప్రజావేదిక వద్ద అర్హులైన 174 మంది లబ్ధిదారులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన , ఎన్టీఆర్ గృహ కల్ప పథకాల కింద నూతన గృహ నిర్మాణ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ. ప్రతి పేదవాడికీ సొంతిల్లు ఉండాలనే దృఢ సంకల్పంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. నివాస గృహాల నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు లోబడి వేగవంతంగా జరగాలని ఆదేశించారు.

**గత ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు:**

పేదల ద్రోహిగా జగన్ రెడ్డి: 2014-19 మధ్యకాలంలో చంద్రబాబు నాయుడు పట్టణాల్లో 1.5 సెంట్లు, గ్రామాల్లో 2 సెంట్లు కేటాయించి పేదల పెన్నిధిగా నిలిస్తే.గత వైకాపా ప్రభుత్వం దాన్ని కేవలం ఒక సెంటుకే పరిమితం చేసి, 'సెంటు పట్టా' పేరుతో భారీ దోపిడీకి పాల్పడిందని దుయ్యబట్టారు.

**12 లక్షల ఇళ్ల పంపిణీ:** గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లతో కలిపి దాదాపు 12 లక్షల గృహాలను పూర్తి చేసి పేదలకు అందిస్తే, జగన్ రెడ్డి ప్రభుత్వం మాత్రం కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమై ఒక్క ఇల్లు కూడా సరిగ్గా పూర్తి చేయలేదని విమర్శించారు. వైకాపా పాలన పేదల సొంతింటి కలలకు తాళం వేసిందని మండిపడ్డారు.

**అధికారులకు స్పష్టమైన ఆదేశాలు:** 2029 నాటికి పక్కా ఇల్లు: 2029 నాటికి రాష్ట్రంలోని ప్రతి అర్హుడికీ పక్కా ఇల్లు అందించడమే

**పేదల సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**



కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కన్నా స్పష్టం చేశారు.

**ఆన్‌లైన్ నమోదు:** ప్రతి గ్రామంలో ఇల్లు లేని అర్హులైన పేదలందరినీ తక్షణమే గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

బాధితులకు న్యాయం: వైకాపా ప్రభుత్వ కక్షసాధింపు చర్యల వల్ల నష్టపోయిన ప్రతీ ఒక్కరి వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పేదల కలలను సాకారం చేసే దిశగా హౌసింగ్ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, వార్డు స్థాయి కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లోని ప్రతినిధులు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున లబ్ధిదారులు పాల్గొన్నారు.





## అభివృద్ధి ప్రాజెక్టుల ఘనంగా ప్రారంభం

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భీమనేని వందనాదేవి**



**గుంటూరు(ఎస్ ఏ పి ఎన్ ):** గుంటూరు నగరంలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానం ద్వారా 'హైబ్రిడ్ యాన్యుటీ మోడల్' కింద చేపట్టిన పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రాధాన్యతా కార్యక్రమానికి ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భీమనేని వందనాదేవి, స్థానిక ఎమ్మెల్యేలు, గుంటూరు జిల్లా కలెక్టర్ సి.ఎమ్. సాయికాంత్ వర్మ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కాథవటే మయూర్ అశోక్‌తో పాటు పలువురు ఇతర ముఖ్య ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భీమనేని వందనాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల ముఖచిత్రాన్ని మార్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్ ఏ ఎం నమూనా ద్వారా మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఆధునిక సదుపాయాల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పట్టణాభివృద్ధి ప్రాజెక్టుల వల్ల ప్రజలకు చేకూరే ప్రయోజనాల గురించి చర్చించారు. కార్యక్రమం విజయవంతంగాతెలుగుదేశం పార్టీ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే కన్నా



**సత్తెనపల్లి (ఎస్ ఏ పి ఎన్):** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొండంత భరోసానిస్తున్నారని తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్ ) కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా 58 మంది లబ్ధిదారులకు అలాగే 23 మంది ఎల్వోసీ లబ్ధిదారులకు కలిపి మొత్తం ?82,45,574 (ఎనభై రెండు లక్షల నలభై ఐదు వేల ఐదు వందల డెబ్బై నాలుగు రూపాయలు) విలువగల చెక్కులను అందజేయడం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ: "పేదల కళ్ళల్లో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధాన లక్ష్యం. కార్పొరేట్ స్థాయిలో వైద్య ఖర్చులు భరించలేని నిరుపేద బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఈ సీఎంఆర్ఎఫ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయింది. కానీ మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 26 నెలల కాలంలోనే సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన 1,082 మంది లబ్ధిదారులకు ?11,34,70,325 ఆర్థిక సాయాన్ని సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించాం. గత ఐదేళ్ల పాలనతో పోల్చి చూస్తే సత్తెనపల్లి నియోజకవర్గం ప్రస్తుతం వేగంగా అభివృద్ధి బాటలో పయనిస్తోంది. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసి చూపిస్తాం" అని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల మరియు గ్రామ స్థాయిలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గ్రంథాలయాల అభివృద్ధికి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధుల సహకారం అభినందనీయం



**వేజండ్ల / చేబ్రోలు (ఎస్ ఎ పి ఎన్ ):** ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వందనా దేవి భీమనేని వేజండ్ల మరియు చేబ్రోలు గ్రామాల్లోని శాఖా గ్రంథాల యాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రంథాలయ భవనాల స్థితిగతులను, సదుపాయాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వేజండ్ల గ్రంథాలయానికి సొంత స్థలంలో నూతన భవన నిర్మాణం చేపట్టుటపై స్థానిక గ్రామ పెద్దలు బండ్లమూడి శివరామకృష్ణయ్య, బాలకృష్ణ, వీరయ్య, లక్ష్మీనారాయణ తదితరులతో చైర్మన్ సుదీర్ఘంగా చర్చించారు. దీనిపై గ్రామ పెద్దలు సానుకూలంగా స్పందిస్తూ, నూతన భవన నిర్మాణానికి తమవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే చేబ్రోలు గ్రంథాలయ భవన పరిస్థితిని పరిశీలించిన అనంతరం, అక్కడి భవన మరమ్మత్తు పనులను తమ సొంత ఖర్చులతో/సహకారంతో చేయిస్తామని ఆ గ్రామ నాయకులు, పెద్దలు ముందుకు వచ్చారు.ఈ సందర్భంగా చైర్మన్ వందనా దేవి మాట్లాడుతూ. వేజండ్ల గ్రంథాలయ నూతన భవన నిర్మాణం విషయమై స్థానిక శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తో కూడా చర్చించామని, అతి త్వరలోనే నూతన భవన నిర్మాణ పనులను వేగవంతంగా ప్రారంభిస్తామని తెలియజేశారు. గ్రంథాలయాల అభివృద్ధికి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు చూపుతున్న చొరవ అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.

## నియోజకవర్గ సమస్యల పరిష్కారమే మా లక్ష్యం



**నరసరావుపేట(ఎస్ ఏ పి ఎన్ ):** నరసరావుపేట కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా సమీక్షా కమిటీ (డి ఆర్ సి ) సమావేశంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి, పార్లమెంట్ సభ్యులు, సహచర శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ మరియు వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలైన సత్తెనపల్లి రూరల్, రాజుపాలెం, ముప్పాళ్ళ, నకరికల్లు ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా:తాగునీటి సమస్య:గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలి. రోడ్ల మరమ్మత్తులు: దెబ్బతిన్న రోడ్లకు తక్షణమే మరమ్మత్తు పనులు చేపట్టాలి. వ్యవసాయం: రైతులకు పంటలకు మద్దతు/గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలి. వైద్య రంగం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో (పీహెచ్ సి) డాక్టర్ల కొరతను తీర్చి మెరుగైన వైద్యసేవలు అందించాలి. విద్యుత్ విద్య: విద్యుత్ సరఫరా అంతరాయాలు లేకుండా చూడటంతో పాటు, పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి. ఈ అంశాలపై శాఖల వారీగా పూర్తి వివరాలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేసిన ఎమ్మెల్యే, ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన ప్రజల కోసం సౌకర్యాలు కల్పించాలన్నారు కార్యక్రమంలో అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు



## మారిన 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ వేళలు



అమరావతి(ఎస్ ఎ పి ఎన్ ):ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ నెలకు సంబంధించి 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చోటుచేసుకుంది. ప్రతి నెలా 1వ తేదీ ఉదయం నుంచే ప్రారంభమయ్యే పింఛన్ల పంపిణీ, ఈసారి మాత్రం అక్టోబర్ 1వ తేదీ మధ్యాహ్నం నుంచి ప్రారంభం కానుంది. నెల చివరి రోజుల్లో బ్యాంకుల వరుస సెలవులు, బ్యాంకు ఉద్యోగుల సమ్మె ప్రతిపాదించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అక్టోబర్ 1వ తేదీ ఉదయాన్నే బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేసుకుని, మధ్యాహ్నం నుంచి నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము అందించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సచివాలయ సిబ్బందికి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అక్టోబర్ నెల పింఛన్ల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 2,692 కోట్లను విడుదల చేసింది. లబ్ధిదారులందరూ ఈ సమయ మార్పును గమనించాలని అధికారులు కోరారు.

## సత్తెనపల్లిలో ఘనంగా సామూహిక 'వందేమాతరం' గీతాలాపన

**సత్తెనపల్లి:** వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా శనివారం సత్తెనపల్లి పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో 'సామూహిక వందేమాతరం' గీతాలాపన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ ఏకకంఠంతో వందేమాతరం పూర్తి గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్తెనపల్లి మండల విద్యాశాఖాధికారి శ్రీ అనంతవరం శ్రీనివాసరావు హాజరుకాగా, గుండ్లపల్లి కృష్ణ(సత్తెనపల్లి మండలం) ప్రధాన వక్తగా వ్యవహరించారు. దేశభక్తిని పెంపొందించడంలో వందేమాతర గేయం పోషించిన పాత్రను, దాని చారిత్రక ప్రాధాన్యతను వారు ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. 1,826 మందితో ఘన విజయం: శ్రీ సరస్వతీ శిశుమందిర్ నిర్వహణలో జరిగిన ఈ సామూహిక గీతాలాపనలో వివిధ పాఠశాలల నుండి మొత్తం 1,826 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో: జైభారత్ స్కూల్ (క్రోసూరు): 1,180 మంది, ఇండియన్ ఐకాన్ స్కూల్: 340 మంది, విద్యాకేంద్రం స్కూల్:200 మంది, శ్రీ సరస్వతి శిశుమందిర్: 92 మంది, అమరావతి పబ్లిక్ స్కూల్: 52 మంది, ఇతరులు: 14 మంది. ఈ కార్యక్రమంలో ప్రభంధకారిణి రాఘవేంద్ర, పాఠశాల ఉపాధ్యక్షులు పుట్టి సాంబశివరావు, పాఠశాల ప్రధానాచార్యులు



శ్రీమతి మన్నవ ధనలక్ష్మి తో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## నకరికల్లు అడ్డరోడ్డులో పోలీసుల తనిఖీలు



**నకరికల్లు(ఎస్ ఎ పి ఎన్ )** నకరికల్లు అడ్డరోడ్డు వద్ద శనివారం పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు మరియు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై, సరైన వాహన పత్రాలు లేని సుమారు 30 మంది వాహనదారులపై పోలీసులు కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు.అలాగే నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతున్న ఒక వ్యక్తిని పోలీసులు పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యక్తిని ఆదివారం ఉదయం కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక పోలీసులు మాట్లాడుతూ.ప్రయాణికుల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని సరైన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## యూపీలో రాజ్యసభ ఎన్నికల సందడి



**న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని 10 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల సంఘం తాజాగా ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. అక్టోబర్ 16న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఎన్నికల ప్రక్రియ అక్టోబర్ 19లోపు పూర్తవుతుంది.**

**బీజేపీకి 8 స్థానాలు? :** 403 మంది సభ్యులున్న యూపీ అసెంబ్లీలో ప్రస్తుతం 397 మంది సభ్యులున్నారు. బీజేపీ, దాని మిత్ర పక్షాలకు కలిపి 289 మంది ఎమ్మెల్యేలు ఉండగా.. సమాజ్‌వాదీ పార్టీకి 101 మంది, కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రస్తుత బలాబలాల ఆధారంగా బీజేపీ నేతృత్వంలోని కూటమి 8 రాజ్యసభ స్థానాలను నిలబెట్టుకునే అవకాశం ఉందని, ఎస్పీ తన స్థానాలను రెండుకు పెంచుకోవచ్చని 'హిందుస్థాన్ టైమ్స్' పేర్కొంది.

**బీఎస్పీకి రాజ్యసభలో..** బహుజన్ సమాజ్ పార్టీకి ప్రస్తుతం రాజ్యసభలో ఉన్న ఏకైక సభ్యుడు రాంజీ గౌతమ్ పదవీకాలం నవంబర్ 25తో ముగియనుంది. యూపీ అసెంబ్లీ, శాసన మండలి, లోక్‌సభలోనూ బీఎస్పీకి ప్రస్తుతం ప్రాతినిధ్యం లేదని నివేదిక తెలిపింది. దీంతో తాజా ఎన్నికల తర్వాత పార్లమెంట్‌లో ఆ పార్టీ ప్రాతినిధ్యం పూర్తిగా ముగిసే పరిస్థితి ఏర్పడింది.

**క్రాస్ ఓటింగ్‌పై రెండు పార్టీల్లోనూ ఉత్కంఠ :** 2024 ఫిబ్రవరిలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఎస్పీ ఎమ్మెల్యేల క్రాస్ ఓటింగ్‌తో బీజేపీ 8 స్థానాలను గెలుచుకుందని నివేదిక పేర్కొంది. ఈసారి కూడా క్రాస్ ఓటింగ్ అంశం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లపై కొందరు ఎమ్మెల్యేల్లో ఉన్న అసంతృప్తి ప్రభావం చూపవచ్చని హిందుస్థాన్ టైమ్స్ విశ్లేషించింది.

**సెప్టెంబర్ 29న నోటిఫికేషన్ :** రాజ్యసభ ఎన్నికలకు సెప్టెంబర్ 29న నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు అక్టోబర్ 6 చివరి తేదీ. అక్టోబర్ 7న నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 9 వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది.

**ఎమ్మెల్సీ స్థానాలకూ ఎన్నికలు :** యూపీలో 11 ఎమ్మెల్సీ స్థానాలకు కూడా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. ఐదు గ్రాడ్యుయేట్, ఆరు టీచర్ నియోజకవర్గాల స్థానాలకు అక్టోబర్ 23న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 27న ఓట్ల లెక్కింపు చేపడతారు. ఈ ఎన్నికల ప్రక్రియ అక్టోబర్ 31లోపు పూర్తవుతుంది.

## అప్పుడు మల్లీశ్వరి.. ఇప్పుడు మీరాబాయి



ఆసియా గేమ్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్ మెడల్ కోసం భారత సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. 28 ఏళ్ల తర్వాత ఈ విభాగంలో మన వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను ఎట్టకేలకు పతకం సాధించింది. జపాన్ వేదికగా జరుగుతోన్న 2026 ఆసియా క్రీడల్లో మహిళల 49కేజీల విభాగంలో ఆమె రజతాన్ని ముద్దాడింది. అంతేకాదు.. ఆసియా క్రీడల్లో మెడల్ రాలేదన్న వెలితి కూడా చానుకు ఇప్పుడు తీరిపోయింది. బుధవారం జరిగిన పోటీల్లో మీరాబాయి చాను స్నాచ్‌లో 87 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 111 కేజీలు ఎత్తింది. మొత్తంగా 198 కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో తొలి స్థానంలో నిలిచిన ఉత్తరకొరియా వెయిట్‌లిఫ్టర్ రి సాంగ్ గమ్.. రికార్డు స్థాయిలో మొత్తం 215 కేజీలు (స్నాచ్‌లో 94 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 121 కిలోలు) ఎత్తి బంగారు పతకం సాధించింది.

ఆసియా గేమ్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో భారత్‌కు పతకం రావడం 28 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం. చివరిసారిగా 1998లో జరిగిన ఆసియా క్రీడల్లో కరణం మల్లీశ్వరి కాంస్యం సాధించింది. ఇక, ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్, కామన్వెల్త్ ఇలా అంతర్జాతీయ టోర్నీల్లో అనేక పతకాలు సాధించినా.. ఆసియా క్రీడల్లో మాత్రం ఆమె ఇప్పటివరకు మెడల్ తీసుకోలేదు. నేటితో ఆ కొరత తీరింది. మీరాబాయి చాను గతంలో టోక్యో ఒలింపిక్స్‌లో రజతం, రెండు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలు, కామన్వెల్త్ గేమ్స్‌లో రెండు స్వర్ణాలు, ఒక రజత పతకాలను సాధించిన సంగతి తెలిసిందే.

**మోదీ అభినందనలు :** ఆసియా గేమ్స్‌లో పతకం నెగ్గిన మీరాబాయి చానుకు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా అభినందలు తెలియజేశారు. ఇది ప్రత్యేకమైన రజతం అని అన్నారు. ఆట పట్ల ఆమెకున్న అంకితభావం ఎంతోమందిలో స్ఫూర్తినింపుతోందని ప్రశంసించారు. చాను ఈ దేశానికి గర్వకారణమని, భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## వైఎస్సార్సీపిని వీడిన చీపురుపల్లి జెడ్పీటిసీ



**విజయనగరం :**జెడ్పీ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు కోసం తాము వైఎస్సార్సీపిని వీడుతున్నట్లు చీపురుపల్లి జెడ్పీటిసీ వలిరెడ్డి శిరీష, ఆమె భర్త, పార్టీ జిల్లా ప్రచార విభాగ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసుల నాయుడు ప్రకటించారు. ఆ మేరకు రాజీనామా పత్రాలను పార్టీ జిల్లా అధ్యక్షులకి పంపుతున్నట్లు తెలిపారు. చీపురుపల్లిలో మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. గడిచిన 20 ఏళ్లుగా తమ లాంటి కార్యకర్తల కోసం పనిచేసిన నాయకుడు చిన్నశ్రీను అని అన్నారు. తనకి కష్టం కలిగి ఇష్టం లేకపోయినా ఆయన ఓ కఠిన నిర్ణయం తీసుకున్నారన్నారు. తాము కష్టంలో ఉన్నప్పుడు చేదోడువాదోడుగా ఉన్న వ్యక్తి కష్టంలో ఉన్నప్పుడు ఆయన వెనుక నిలబడడం తమ వంతు కర్తవ్యంగా భావిస్తున్నామన్నారు. అందువలనే ఆయనతో పాటు నడిచేందుకు నిర్ణయించుకున్నామన్నారు. ఆ కారణంగానే వైఎస్సార్సీపికీ, చీపురుపల్లి జెడ్పీటిసీ స్థానానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి సమయంలోనైనా ఏ కార్యకర్తకి కష్టం కలిగినా వెంటనే స్పందించిన నాయకుడి కోసం తామే కాకుండా తమలాంటి అనేక మంది నాయకులు పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. చిన్న శ్రీను వెంట నడిచేందుకు సన్నద్ధమవుతున్నారన్నారు. త్వరలోనే వాళ్లందరూ చిన్నశ్రీను వెంట టిడిపిలోకి చేరుతారని స్పష్టం చేశారు.

# ఉత్పాదకతకు దూరమవుతున్న యువత

### యువశక్తికి ఉపాధి అవకాశాలే కీలకం



**న్యూఢిల్లీ: దేశానికి యువశక్తి అతిపెద్ద ఆర్థిక బలం. యువతకు విద్య, ఉపాధి, నైపుణ్య శిక్షణ అందించి సద్వినియోగం చేసుకుంటే దేశ ఆర్థిక ప్రగతికి అది గొప్ప అవకాశంగా మారుతుంది. అయితే చదువులో కొనసాగక, ఉద్యోగంలో చేరక, ఎలాంటి వృత్తి శిక్షణ పొందకుండా ఉన్న యువత సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి యువతకు సరైన దిశానిర్దేశం, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు అందకపోతే దేశానికి లభించిన యువ జనాభా బలం భారంగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.**

### భారీగా నిధులు.. పరిమిత ఫలితాలు

యువతకు నైపుణ్యాలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా భారీగా నిధులు వెచ్చిస్తున్నాయి. వృత్తి శిక్షణ, పారిశ్రామిక శిక్షణ, అప్రెంటిస్‌షిప్, స్వయం ఉపాధి వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. వేలాది మంది శిక్షణ పొందుతున్నారు. అయితే శిక్షణ పూర్తిచేసిన ప్రతి ఒక్కరికీ స్థిరమైన ఉపాధి లభిస్తుందా? అనే ప్రశ్నకు మాత్రం స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. శిక్షణ తీసుకున్న వారి సంఖ్య, ఇచ్చిన ధ్రువపత్రాల సంఖ్యకే ప్రాధాన్యం ఇస్తే అసలు ప్రయోజనం నెరవేరదని నిపుణులు చెబుతున్నారు. శిక్షణ తర్వాత ఉద్యోగం లభించిందా? ఉద్యోగంలో కొనసాగుతున్నారా? ఎంత వేతనం పొందుతున్నారు? వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### ధ్రువపత్రాలతోనే ఉపాధి రాదు

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందించకపోవడం మరో ప్రధాన సమస్యగా మారింది. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, యంత్ర ఆధారిత తయారీ, పునరుత్పాదక ఇంధనం, సమాచార సాంకేతిక రంగం, సేవా రంగాల్లో కొత్త నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. అయితే కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ పాత తరహా శిక్షణకే పరిమితమవుతున్న పరిస్థితి ఉంది. ఫలితంగా చేతిలో ధ్రువపత్రం ఉన్నా పరిశ్రమలు కోరుకునే నైపుణ్యాలు లేక యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారు.

### స్థానిక అవసరాలకే ప్రాధాన్యం

దేశవ్యాప్తంగా ఒకే విధమైన శిక్షణా విధానాన్ని అమలు చేయడం కంటే ఆయా ప్రాంతాల అవసరాలను గుర్తించి శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఒక ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు కార్మికులు అవసరమైతే.. మరో ప్రాంతంలో పర్యాటకం, తయారీ, రవాణా, సేవా రంగాలకు నైపుణ్యం కలిగిన యువత అవసరం ఉండొచ్చు. స్థానిక పరిశ్రమలు, చిన్నతరహా వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలతో శిక్షణను అనుసంధానం చేస్తే యువత సొంత ప్రాంతాల్లోనే ఉపాధి పొందే అవకాశం పెరుగుతుంది. వలసల సమస్య కూడా కొంతవరకు తగ్గుతుంది.

### మహిళా యువతకు ప్రత్యేక సమస్యలు

మహిళా యువతకు శిక్షణ అందించడం మాత్రమే సరిపోదు. శిక్షణ అనంతరం ఉద్యోగానికి వెళ్లేందుకు సురక్షిత రవాణా, కార్యాలయ భద్రత, పిల్లల సంరక్షణ వంటి సదుపాయాలు కూడా అవసరం. కుటుంబ బాధ్యతల కారణంగా అనేక మంది మహిళలు శిక్షణ పొందినప్పటికీ ఉద్యోగాల్లో చేరలేకపోతున్నారు. మహిళల ఉపాధిని పెంచేందుకు శిక్షణతో పాటు సామాజిక, మౌలిక వసతులను కూడా కల్పించాల్సిన అవసరం ఉంది.

### ఉపాధితోనే నిధుల ఫలితాలను కొలవాలి

శిక్షణా సంస్థలకు నిధులు విడుదల చేసే విధానంలో మార్పులు రావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎంతమందికి శిక్షణ ఇచ్చారనే దానికంటే.. ఎంతమందికి ఉద్యోగాలు లభించాయి, ఎంతకాలం కొనసాగారు అనే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పరిశ్రమల్లోనే దీర్ఘకాలిక శిక్షణ, పని అనుభవం కల్పించే విధానాన్ని బలోపేతం చేయాలి. జిల్లా స్థాయిలో పరిశ్రమల అవసరాలను గుర్తించి, అందుకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలను రూపొందించాలి.

### యువశక్తిని సద్వినియోగం చేస్తేనే..

భారత్‌కు లభించిన యువ జనాభా దేశ ఆర్థిక ప్రగతికి గొప్ప అవకాశమే. అయితే ఆ యువశక్తికి సరైన విద్య, నైపుణ్యం, ఉపాధి అందినప్పుడే దాని పూర్తి ప్రయోజనం లభిస్తుంది. శిక్షణ పేరుతో ధ్రువపత్రాలు అందించడం కాకుండా.. యువతను స్థిరమైన ఉపాధి వైపు నడిపించడమే ప్రభుత్వ విధానాల ప్రధాన లక్ష్యంగా మారాలి. యువత చేతుల్లో నైపుణ్యం.. వారి జీవితాల్లో ఉపాధి.. దేశ ఆర్థిక వ్యవస్థలో వారి భాగస్వామ్యం పెరిగినప్పుడే యువ జనాభా బలం నిజమైన అభివృద్ధి శక్తిగా మారుతుంది.

# త్యాగాలకు గుడ్‌బై.. జనసేనకు ఇక 'సొంత బాట'!



- సీట్ల విషయంలో ఇక తగ్గేదేలే.. పవన్ వ్యూహం ఇదేనా?
- కూటమిలో పవన్ 'సీట్ల పంచ్'.. లెక్కలు మారబోతున్నాయా..
- పొత్తు పేరుతో తగ్గేదే లేదు..పవన్ క్లియర్ మెసేజ్
- జనసేనకు త్యాగాలు చాలు.. ఇక బలమున్న చోట బరిలోకి
- పవన్ మార్క్ పాలిటిక్స్.. కూటమిలో కొత్త సమీకరణాలకు తెర?

**అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ కూటమి రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. ఇప్పటివరకు కలిసి నడిచిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి.. స్థానిక ఎన్నికల్లోనూ అదే ఫార్ములాను కొనసాగిస్తుందా? లేక జనసేనాని పవన్ కల్యాణ్ పార్టీని సొంతంగా బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారా? తాజాగా పార్టీ కార్యకర్తలతో జరిగిన అంతర్గత సమావేశంలో పవన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఈ ప్రశ్నలను రేకెత్తిస్తున్నాయి.**

**'అసెంబ్లీ ఎన్నికల సమయంలో చాలా త్యాగాలు చేశాం.. మళ్లీ మళ్లీ త్యాగాలు చేసే ఓపిక పార్టీకి లేదు' అన్న పవన్ వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర ప్రయోజనాల కోసం గతంలో సీట్ల విషయంలో రాజీ పడ్డామని.. ఇకపై పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పడం ద్వారా కూటమి భాగస్వాములకు ఏదైనా ప్రత్యేక సంకేతం ఇచ్చారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో.. 'కార్యకర్తలు, పార్టీ నాయకులు ఏం చెబితే అదే ఫైనల్.. అలాగే ముందుకెళ్దాం' అంటూ పవన్ చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. స్థానిక ఎన్నికల్లో పార్టీ శ్రేణుల అభిప్రాయానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నదే ఆయన ఉద్దేశమా? లేక సీట్ల సర్దుబాటులో ఇకపై జనసేన మరింత పట్టుబట్టబోతోందన్న సంకేతమా? అన్న చర్చ సాగుతోంది. మరోవైపు కూటమి ఐక్యతపై టీడీపీ నేతలు వరుసగా స్పష్టమైన ప్రకటనలు చేస్తున్న సమయంలోనే పవన్ భిన్నమైన స్వరం వినిపించడం గమనార్హం. మరో మూడు సార్వత్రిక ఎన్నికలే కాదు.. అవసరమైతే ఎప్పటికీ కూటమి కలిసి పోటీ చేస్తుందని నారా లోకేష్ చెబుతున్న వేళ.. జనసేనాని మాత్రం పార్టీ బలోపేతం, సీట్ల పెంపు, కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యం వంటి అంశాలను ముందుకు తేవడం రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.**

### 'పొత్తు ధర్మం' అంటే ఇదేనా?

'పొత్తు ధర్మం పాటిస్తూనే.. మనం గెలిచే అన్ని స్థానాల్లోనూ పోటీ చేద్దాం' అంటూ పవన్ ఇచ్చిన దిశానిర్దేశమే ఇప్పుడు అసలు చర్చకు కారణంగా మారింది. కూటమిలో భాగంగా జనసేనకు కేటాయించే స్థానాల్లో పోటీ చేయడంతో పాటు.. తమకు బలం ఉన్న ప్రతి చోటా అభ్యర్థులను నిలబెట్టాలన్నదే ఈ వ్యాఖ్యల ఉద్దేశమైతే.. సీట్ల సర్దుబాటు విషయంలో జనసేన ఇక రాజీ పడకూడదన్న సంకేతంగా దీనిని చూడాల్సి వస్తుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఎందుకంటే పొత్తు అంటే పరస్పర సర్దుబాటు. ఒక పార్టీకి బలమున్న ప్రతి స్థానంలో ఆ పార్టీనే పోటీ చేస్తే.. మిగిలిన భాగస్వాములకు స్థలం ఎక్కడ ఉంటుంది? ఇదే సూత్రాన్ని టీడీపీ, బీజేపీ కూడా అనుసరిస్తే.. కూటమి సీట్ల పంపకం అసలు ఎలా సాధ్యమవుతుందన్న ప్రశ్న ముందుకొస్తుంది. అదే సమయంలో జనసేనకు కేటాయించే సీట్లు పరిమితంగా ఉంటే.. పార్టీని క్షేత్రస్థాయిలో ఎలా విస్తరించాలన్నది కూడా ఆ పార్టీ ముందున్న సవాలే. అందుకే స్థానిక ఎన్నికలను జనసేన తన సంస్థాగత బలాన్ని పెంచుకునే అవకాశంగా చూస్తున్నట్లు పవన్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

### సీట్లు పెంచుకోవడమే అసలు వ్యూహమా?

స్థానిక ఎన్నికల్లో జనసేన తన వాటాను గణనీయంగా పెంచుకోవాలని పవన్ భావిస్తున్నారా? గత ఎన్నికల్లో చేసిన త్యాగాలను ఇక పునరావృతం చేయకూడదన్న ఉద్దేశంతో.. ఈసారి సీట్ల విషయంలో కఠినంగా వ్యవహరించాలనుకుంటున్నారా? అన్నదే ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ప్రధాన చర్చ. అయితే కూటమి కొనసాగాలంటే మూడు పార్టీల మధ్య పరస్పర అవగాహన, సీట్ల సర్దుబాటు కీలకం. జనసేన తనకు బలం ఉన్న ప్రాంతాల్లో మరింత వాటా కోరుకోవడం ఒక కోణమైతే.. అదే సమయంలో మిత్రపక్షాల ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల పవన్ తాజా వ్యాఖ్యలను 'పొత్తులకు రాం రాం' అనే తుది నిర్ణయంగా చూడాలా? లేక 'ఇకపై సీట్ల విషయంలో జనసేనకు త్యాగాలు వద్దు.. గౌరవప్రదమైన వాటా కావాలి' అన్న రాజకీయ సందేశంగా చూడాలా? అన్నది స్థానిక ఎన్నికల సీట్ల సర్దుబాటు సమయంలోనే స్పష్టమయ్యే అవకాశం ఉంది. స్థానిక ఎన్నికలు కూటమి ఐక్యతకు పరీక్షగా మారబోతున్నాయా? లేక జనసేన బలాన్ని కొత్తగా చాటుకునే వేదికగా మారబోతున్నాయా? అన్నదే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది.

## బాబు ఏడాది పాలన సంబరం ఖర్చు రూ.7,29,03,156

**అమరావతి:** సీఎం చంద్రబాబు ఏడాది పాలన సంబరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.7,29,03,156లను ఖర్చు చేసింది. ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో గత ఏడాది జూన్ 23న ఏపీ సచివాలయం వెనుక ఉన్న ప్రాంగణం లో సభ నిర్వహించారు. ఈ సభ ఖర్చులకు సంబంధించి ప్రణా ళికా శాఖ జారీ చేసిన ఉత్తర్వులపై ఆర్థికశాఖ పలు వ్యాఖ్యలు చేసింది. ఈ నేపథ్యంలో ఆ సభ నిర్వహణకు సంబంధించిన ఖర్చులపై ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ గురువారం సవివరమైన ఉత్తర్వులు జారీ చేశారు. మూడు జిల్లాల కలెక్టర్లతోపాటు ఏపీఎస్ఆర్టీసీ వీసీ అండ్ ఎండీకి ఈ మొత్తం నిధులను విడుదల చేయనున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. గుంటూరు జిల్లా కలెక్టర్‌కు రూ.4,94,64,946, కృష్ణా జిల్లా కలెక్టర్‌కు రూ.2,17,76,139, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు రూ.1,15,748, ఏపీఎస్ఆర్టీసీ వీసీ అండ్ ఎండీకి రూ.15,46,323లు చొప్పున విడుదల చేయనున్నట్లు వివరించారు.

## పదేళ్లలో కొల్లగొట్టింది రూ. 94 వేల కోట్లు!

**న్యూఢిల్లీ/రాయ్‌పూర్:** ఆన్‌లైన్‌లో బెట్టింగ్ కార్యకలాపాలకు పాల్పడే మహాదేవ్ యాప్ ఇప్పటికీ యాక్టివ్‌గానే ఉందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలిపింది. ప్రధాన యాప్‌తోపాటు దాని అనుబంధ యాప్‌లు కలిసి గత పదేళ్లలో రూ.94 వేల కోట్లకు పైగా అక్రమంగా బెట్టింగ్‌ల ద్వారా దండుకున్నాయని వివరించింది. ఈ మేరకు ఈడీ ఛత్తీస్‌గఢ్ రాయ్‌పూర్‌లోని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో ఇటీవల తన ఆరో చార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఇందులో 42 మంది వ్యక్తులు, సంస్థలను నిందితులుగా పేర్కొంది. మహాదేవ్ యాప్ విదేశాల నుంచి చట్టవిరుద్ధంగా నిర్వహించే బెట్టింగ్ వెబ్‌సైట్‌ల సముదాయమని తెలిపింది. దీని ప్రధాన నిర్వాహకులు, ప్యానెల్ సభ్యులు ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారని పేర్కొంది. మహాదేవ్ ఆన్‌లైన్ బుక్‌గా కూడా పిలువబడే ఈ యాప్, వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూప్‌లు, ఫేస్‌బుక్ పేజీల ద్వారా ప్రచారం చేస్తోందని, త్వరగా డబ్బు సంపాదించవచ్చని ఆశచూపి వేలాది మంది యువకులను ఆకర్షిస్తోందని ఈడీ పేర్కొంది.

## 29న సీడబ్ల్యూసీ కీలక భేటీ

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అత్యున్నత నిర్ణాయక మండలి సీడబ్ల్యూసీ ఈనెల 29వ తేదీన సమావేశం కానుంది. కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) పనితీరు, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో జరగనున్న ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈసీ తీరుపై వెల్లువెత్తుతున్న తీవ్ర అభ్యంతరాలపై సీడబ్ల్యూసీ కూలంకషంగా చర్చించనుందని పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ అనుసరించాల్సిన వ్యూహంతో పాటు ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రానున్న అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధత అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కేంద్ర ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఓటర్ల జాబితా, సర్, ఎన్నికల సాఫ్ట్‌వేర్, ఓటర్ల నమోదుకు సంబంధించిన నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వస్తున్న కథనాలు ప్రస్తుతం సంచలనంగా మారాయి. అదేవిధంగా, కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో సర్‌కు సంబంధించిన కొత్త వివరాలను చేర్చడంపైనా ప్రస్తుతం వివాదం నెలకొంది.

## బెంగాల్ ఎన్నికల కోసం బీజేపీ 286.99 కోట్ల ఖర్చు



**ఢిల్లీ :** ఈ ఏడాది ప్రారంభంలో ఎన్నికలు జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ మొత్తం రూ.248.55 కోట్లు ఖర్చుచేయగా కేవలం పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ రూ.289.99 కోట్లు ఖర్చు చేసింది. ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన వ్యయ వివరాల నివేదికల ప్రకారం అస్సాం, కేరళ, తమిళనాడు, బెంగాల్, పుదుచ్చేరిలో జరిగిన ఎన్నికలతో కలిసి మొత్తం ఐదు ఎన్నికల కోసం బీజేపీ చేసిన రూ.529.38 కోట్ల వ్యయంలో సగానికి పైగా వాటా బెంగాల్‌కే చెందుతుంది. బెంగాల్‌లో సాధారణ ప్రచారం కోసం రూ.217.16 కోట్లు, అభ్యర్థుల కోసం రూ.69.83 కోట్లు బీజేపీ ఖర్చు చేసింది. 2011లో అధికారాన్ని కోల్పోవడానికి ముందు దశాబ్దాల పాటు బెంగాల్‌ను పాలించిన సీపీఎం 197 స్థానాల్లో పోటీ చేసి ఒక స్థానాన్ని గెలుచుకుంది. అభ్యర్థులపై చేసిన ఖర్చుతో కలిపి మొత్తం రూ.8.23 కోట్లు ఖర్చు చేసినట్టు ఆ పార్టీ రాష్ట్ర విభాగం తెలిపింది. బెంగాల్‌లో బీజేపీకి ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) వ్యయ వివరాల నివేదికను ఇంకా బహిర్గతం చేయలేదు.

**కేరళలో భిన్న పరిస్థితి :** పార్టీలు ప్రకటించిన వ్యయాల ఆధారంగా కేరళలో వైరుధ్యం కనిపిస్తున్నది. కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి, సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్(ఎల్‌డీఎఫ్)ను పడగొట్టింది. ఇందులో కాంగ్రెస్ 63 సీట్లు, సీపీఎం 26 సీట్లు గెలుచుకున్నాయి. బీజేపీ మూడు సీట్లు గెలుచుకుంది. కేరళలో కాంగ్రెస్ తన ప్రధాన కార్యాలయం, రాష్ట్ర విభాగం ద్వారా రూ.105.34 కోట్లు ఖర్చు చేసింది. ఇది బీజేపీ ఖర్చు చేసిన రూ.82.67 కోట్ల కంటే ఎక్కువ. కేరళలో కీలక శక్తిగా ఉన్న సీపీఎం తన రాష్ట్ర విభాగం ద్వారా రూ.28.60 కోట్లు ఖర్చు చేసింది. బెంగాల్, కేరళలో చేసిన ఖర్చులకు అదనంగా అస్సాంలో రూ.96.27 కోట్లు, తమిళనాడులో రూ.51.56 కోట్లు, పుదుచ్చేరిలో రూ.11.90 కోట్లు ఖర్చు చేసినట్టు బీజేపీ నివేదించింది.

## తిరుమలలో పునఃప్రారంభమైన ఉచిత సర్వదర్శన టోకెన్ల జారీ



**తిరుపతి:** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఈ నెల 14 నుంచి 23 వరకు కనుల పండువుగా నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల రద్దీని నియంత్రించేందుకు సర్వదర్శన ఉచిత టోకెన్ల జారీని నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ ఉచిత టోకెన్ల జారీని తిరిగి నేడు సెప్టెంబర్ 24 నుంచి ప్రారంభించినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసం కేంద్రాల్లో వీటిని జారీ చేస్తారు. సర్వదర్శనం కోసం క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లలో వేచి ఉండే సాధారణ భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించే ఉద్దేశంతో ఈ ఉచిత టోకెన్లను జారీ చేస్తారని సంగతి తెలిసిందే. బ్రహ్మోత్సవాల సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో టోకెన్ల జారీ కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఈ టోకెన్లను నిలిపివేసిన విషయం విదితమే. ఈ టోకెన్ల జారీ కార్యక్రమం నేటి నుంచి తిరిగి ప్రారంభించారు. ఈ విషయాన్ని గమనించి శ్రీవారి దర్శన యాత్రను ప్లాన్ చేసుకోవాలని టీటీడీ అధికారులు భక్తులకు సూచించారు.

## నాగావళి, వంశధార నదులకు వరద ఉధృతి



**శ్రీకాకుళం :** బంగాఖాతంలో వాయుగుండం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ భారీ వర్షాల కారణంగా ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని ప్రధాన నదులైన వంశధార, నాగావళిలలో వరద ఉధృతి అంతకంతకే పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో అధికారులు ప్రధాన బ్యారేజీల వద్ద మొదటి ప్రమాద హెచ్చరికలు జారీచేశారు. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రవిపత్తుల నిర్వహణ సంస్థ సూచిం చింది. వంశధార నదిపై ఉన్న గొట్టా బ్యారేజ్ వద్ద అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికలు జారీచేశారు. ప్రస్తుతం గొట్టా బ్యారేజ్‌లోకి 41,014 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా.. అంతే మొత్తంలో నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. మరోవైపు నాగావళి నదిలోనూ వరద ప్రవాహం కొనసాగుతున్నది. తోటపల్లి బ్యారేజ్ వద్ద ఇన్-ఫ్లో, అవుట్-ఫ్లో 45,661 క్యూసెక్కులుగా నమోదవుతున్నది. నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆనకట్ట వద్ద ప్రవాహం 59,700 క్యూసెక్కులకు చేరడంతో అధికారులు అక్కడ కూడా మొదటి ప్రమాద హెచ్చరికలు జారీచేశారు. ఈ వరద పరిస్థితులపై రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ స్పందించారు. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వరద తీవ్రత దృష్ట్యా నదుల్లోకి ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం వంటి పనులు అత్యంత ప్రమాదకరమని, అటువంటి వాటికి దూరంగా ఉండాలని ఆయన స్పష్టంచేశారు.

## అక్టోబర్ 2న 'నో యూపీఐ డే!'.. ఎండీఆర్‌పై దేశ వ్యాప్తంగా నిరసన




**న్యూఢిల్లీ :** యూపీఐ లావాదేవీలపై కేంద్రం విధించనున్న ఎండీఆర్‌పై దేశ వ్యాప్తంగా వ్యాపారుల నిరసన తీవ్రమవుతున్నది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 2న దేశ వ్యాప్తంగా 'నో యూపీఐ డే'ను పాటించాలని వర్తక సంఘాలు నిర్ణయించాయి. ఈ నిరసనలో 500 సంఘాల వరకు పాల్గొంటాయని అంచనా వేస్తున్నారు.

దుకాణదారులు కూడా ఈ నిరసనల్లో భాగం కానున్నారు. ఆ రోజు వ్యాపారులు తమ క్యూఆర్ కోడ్లను, స్కానర్లను, సౌండ్ బాక్స్‌లను, ఇతర డిజిటల్ చెల్లింపు పరికరాలను నల్లని వస్త్రంతో కప్పి కేంద్ర ప్రభుత్వానికి తమ నిరసనను తెలపనున్నారు. ఈ నిరసన గురించి తాను దేశ వ్యాప్తంగా పలు వాణిజ్య సంఘాలతో మాట్లాడానని మహారాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ, అగ్రికల్చర్ అధ్యక్షుడు రవీంద్ర మంగ్వే తెలిపారు.

అఖిల భారత వినియోగ ఉత్పత్తుల పంపిణీదారుల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు ధైర్యశీల్ పాటిల్ మాట్లాడుతూ రిటైల్ వ్యాపారులు, డిస్ట్రిబ్యూటర్లు చాలా తక్కువ లాభంతో వ్యాపారాలు నిర్వహిస్తారని తెలిపారు. డిజిటల్ చెల్లింపులపై అదనపు చార్జీలు విధిస్తే వారి వ్యాపార నిర్వహణ భారమవుతుందన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించకపోతే తమ ఆందోళనను తీవ్రం చేస్తామని అఖిల భారత వంట నూనె వర్తకుల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు శంకర్ థక్కర్ హెచ్చరించారు. రిటైల్ వ్యాపారుల సంక్షేమ సంఘాల సమాఖ్య, ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్, అఖిల భారత నగల వర్తకులు, స్వర్ణకారుల సమాఖ్య, అఖిల భారత వంట నూనె వ్యాపారుల ఫెడరేషన్ అక్టోబర్ 2న 'నో యూపీఐ డే'కు మద్దతు తెలుపుతున్నాయి.

## దసరా, దీపావళికి ప్రత్యేక రైళ్లు



**అమరావతి :** దసరా, దీపావళి పండగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. సికింద్రాబాద్-కాకినాడ మధ్య అక్టోబర్ 7 నుంచి నవంబర్ 25 వరకు రైలును నడుపనుంది. జల్నా-యలహంక మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలును అక్టోబర్ 4 నుంచి నవంబర్ 25 వరకు పొడిగించింది. ప్రయాణికులు వినియోగించు కోవాలని కోరింది.

## జీవగడియారం అంటే ఏమిటి..



**మన శరీరంలో నిద్ర, మెళకువ సమయాలను మాత్రమే కాకుండా హార్మోన్ల విడుదల, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మానసిక స్థితి వంటి అనేక అంశాలను నియంత్రించే అంతర్గత జీవ గడియారం ఉంటుంది. మెదడులోని చిన్న భాగం వెలుతురు, చీకటి సమాచారాన్ని గుర్తించి శరీర రోజువారీ కార్యకలాపాలను ఒక క్రమంలో నడిపిస్తుంది. ఈ సహజ రిథమ్ క్రమం తప్పితే దాని ప్రభావం కేవలం నిద్రపైనే కాకుండా మెదడు పనితీరుపైనా పడుతుంది. నిద్ర వేళలు తరచూ మారడం, రాత్రివేళల్లో ఫోన్ చూడడం, రాత్రి షిఫ్టుల్లో పనిచేయడం, సుదీర్ఘ ప్రయాణాలు చేయడం వంటి కారణాలు శరీర జీవ గడియారాన్ని గాడి తప్పిస్తాయి.**

### సరిగ్గా పనిచేయకపోతే..

జీవ గడియారం సరిగ్గా పనిచేయకపోతే ముందుగా ఏకాగ్రత, జ్ఞాపకశక్తిపై ప్రభావం కనిపిస్తుంది. ఎంతసేపు నిద్రపోయినా మెదడు పై మబ్బులా అనిపించడం, సాధారణంగా గుర్తుండే విషయాలను మర్చిపోవడం, పనిపై దృష్టి పెట్టలేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. దీనితోపాటు చిరాకు, ఆందోళన, మానసికంగా ఉత్సాహం తగ్గడం వంటి మార్పులు కూడా కనిపిస్తాయి. శరీర జీవ గడియారం దెబ్బతినడం వల్ల భావోద్వే గాలను నియంత్రించే మెదడు భాగాల పనితీరుపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలంగా నిద్రకు అంతరాయం కలిగితే భవిష్యత్తులో జ్ఞాపకశక్తి, మెదడు పనితీరు తగ్గే ప్రమాదం కూడా ఉంటుంది.

### ఒకే సమయానికి నిద్ర లేవాలి..

జీవ గడియారాన్ని సరిచేసుకోవడానికి ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రలేవడం ముఖ్యమైన అలవాటుగా . వారాంతాల్లో కూడా ఎక్కువసేపు నిద్రపోయి సమయాన్ని మార్చకుండా ఒకే విధమైన షెడ్యూల్‌ను పాటించడం ఉపయోగకరంగా ఉంటుంది. నిద్రలేచిన తర్వాత కొద్దిసేపు సహజమైన సూర్యకాంతిలో ఉండడం శరీర గడియారానికి రోజును గుర్తించేందుకు సహాయపడుతుంది. రాత్రి సమయంలో కాంతిని తగ్గించడం, పడుకునే ముందు తెరలను చూడడం తగ్గించడం, కెఫీన్‌ను రోజులో ముందుగానే తీసుకోవడం, భోజన సమయాలను సాధ్యమైనంత వరకు ఒకే విధంగా ఉంచడం, బయట కొంత శారీరక చురుకుదనం ఉండేలా చూసుకోవడం వంటివిఎంతగానో ఉపయోగపడతాయి.

### మెగ్నీషియం క్రీములు వాడొచ్చా..

ప్రస్తుతం నిద్ర కోసం మెగ్నీషియం కలిగిన పాదాల క్రీములు మార్కెట్లో అందుబాటులో ఉన్నప్పటికీ, జీవ గడియారాన్ని క్రమబద్ధం చేసుకోవడంపైనే దృష్టి సారించాలి. నిద్ర, మెళకువ సమయాలను క్రమంలోకి తీసుకురావడం, వెలుతురు-చీకటి సహజ చక్రానికి అనుగుణంగా జీవించడం ద్వారా నిద్ర నాణ్యతను మెరుగుపరచుకోవచ్చు. ఈ మార్పులు చేసినప్పటికీ ఏకాగ్రత తగ్గడం, మానసిక స్థితి సరిగా లేకపోవడం లేదా నిద్రపోయినా అలసట కొనసాగడం వంటి సమస్యలు ఉంటే వాటిని సాధారణ అలసటగా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం అవసరం. ఇలాంటి లక్షణాలు నిద్రకు సంబంధించిన ఇతర సమస్యలకు సంకేతం అవుతాయని నిపుణులు చెబుతున్నారు.

## తీవ్ర అల్పపీడనం ఎఫెక్ట్.. పూరీ తీరం అల్లకల్లోలం

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో ఒడిశాలోని పూరీ తీరం అల్లకల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. తీవ్ర అల్పపీడనం తీరం వైపు కదులుతున్నా కొద్ది పరిస్థితి భయానకంగా మారుతోంది. దాంతో అధికారులు తీరం వెంట ఎర్రజెండాలు ఎగురవేయించారు. బీచ్‌లకు వచ్చిన పర్యాటకులంతా వెంటనే సముద్ర తీరం నుంచి వెళ్లిపోవాలని మైక్‌లలో హెచ్చరిస్తున్నారు.

ఇదిలావుంటే తీవ్ర అల్పపీడనం ప్రభావంతో ఇప్పటికే ఒడిశాలోని దక్షిణ తీర ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. తీవ్ర అల్పపీడనం తీరాన్ని సమీపించే కొద్దీ వర్షాలు మరింత ఎక్కువగా కురిసే అవకాశం ఉందని, సముద్ర తీరం మరింత భయంకరంగా మారే ప్రమాదం ఉందని భారత వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో సంబంధిత అధికారులు తీర ప్రాంతాల్లోని దాదాపు 3,500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

మంగళవారం నుంచే ఒడిశాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పుడు వాటి తీవ్రత మరింత పెరుగుతున్నది. బుధవారం ఉదయం 8.30 గంటల వరకు నమోదైన వివరాల ప్రకారం.. అప్పటివరకు గడిచిన 24 గంటల్లో కోరాపుట్ జిల్లాలోని సెమిలిగుడలో అత్యధికంగా 230 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత అదే జిల్లాలోని జైపూర్‌లో 161 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.





## ప్రకృతి - ప్రళయం

**ఈ సృష్టి ఎంత అద్భుతమైనదో, దాని తెర వెనుక నడిచే కాలపు నాటకం అంతకంటే విచిత్రమైనది. మనిషి తన మేధస్సుతో ఆకాశాన్నీ, అంతరిక్షాన్నీ శాసించేస్తున్నానని భుజాలు ఎగిరేస్తున్నాడు. నేనే సర్వస్వం అనుకుంటూ దర్పంతో విర్రవీగుతున్నాడు. కానీ, ఆ సర్వశక్తిమంతుడైన సృష్టికర్త ఒక చిన్న చదరంగపు కాయను కదిలిస్తే చాలు... ఈ అహంకారపు సామ్రాజ్యాలు క్షణాల మీద ఇసుక కోటల్లా కూలిపోతాయి.**

### విపత్తులు దైవిక హెచ్చరికలు

నిజానికి, ప్రకృతి విపత్తులు అంటే కేవలం భూమి కదలడమో, నదులు పొంగిపొర్లడమో కాదు. అవి దైవిక శక్తి ముందు మానవుని అస్తిత్వపు అసమర్థతను ఎత్తిచూపే నిదర్శనాలు! పవిత్ర ఖురాన్ ఈ సత్యాన్ని ఎంత చక్కగా గుర్తుచేస్తుందంటే:'మనుషుల చేతులు సంపాదించుకున్న కర్మల కారణంగానే భూమిపై, సముద్రంలో కల్లోలం చెలరేగింది. వారు తమ (చెడు) కర్మల నుంచి వెనక్కి మళ్లే నిమిత్తం అల్లాహ్ వారికి తమ కర్మల ఫలితాలను కొద్దిగా రుచి చూపిస్తాడు' (ఖురాన్ 30:41) అని హెచ్చరించింది.సమాజంలో పాపాలు హద్దులు మీరినప్పుడు, ధర్మం మరుగున పడి అన్యాయం తాండవిస్తున్నప్పుడు, ఆ దేవుడు మనుషులను మేల్కొల్పడానికి ఇలాంటి విపత్తులనే పెద్ద చౌకీదారులుగా పంపుతాడు. ఇవి కేవలం శిక్షలు మాత్రమే కావు; దారి తప్పిన మనిషిని మళ్లీ సన్మార్గంలో నడిపించడానికి వచ్చే గట్టి హెచ్చరికలు.

### మహా వినాశనం..

ఈ చిన్న చిన్న విపత్తులు రాబోయే ప్రళయ కాలానికి సూచికలు. మహా వినాశనం వేళ భూమి తన కడుపులో దాచుకున్న నిధులను, భారాన్ని ఒక్కసారిగా కక్కివేసే భీకర భూకంపాలు వస్తాయి. ఈ సంఘటనను ఖురాన్ స్పష్టంగా తెలియజేసింది. 'భూమి తన అత్యంత భీకరమైన ప్రకంపనలతో కంపించినప్పుడు, భూమి తనలో దాచుకున్న బరువులన్నిటినీ బయటికి కక్కివేసినప్పుడు, మనుషుడు 'దీనికి ఏమైంది?' అని విస్మయానికి గురైనప్పుడు...' (ఖురాన్ 99:1-3) అంతా వినాశనమే! మానవుడి పాపాలు శ్రుతి మించినప్పుడు నేల కుంగిపోవడం, ఆకాశం నుంచి ఆపదలు ముంచెత్తడం జరుగుతుంది. ఆపై ఏర్పడే అశాంతి, జరిగే మహా విలయం ఈ భూగోళాన్ని అతలాకుతలం చేస్తాయి. మొత్తంగా చూస్తే... ఈ ప్రపంచం శాశ్వతం కాదనీ, ఇదొక తాత్విక ప్రయాణమనీ, మనిషి తన గర్వాన్ని విడనాడి నీతిగా, నిజాయితీగా, తోటివారికి సాయపడుతూ బతకాలనీ ఈ విపత్తులన్నీ మూగ భాషలో మనకు మళ్లీ మళ్లీ గుర్తుచేస్తూనే ఉన్నాయి. ఈ సృష్టికి ఒక అంతం ఉందన్న సత్యాన్ని గ్రహించి, ఆ దేవుని మార్గంలో నడవడమే మానవ జన్మకు సార్థకత!

## 2000 బెడ్స్‌తో అదానీ ఆస్పత్రి.. కోల్‌కతాలో శంకుస్థాపన

**కోల్‌కతా:** కోల్‌కతా సమీపంలోని న్యూ టౌన్ ఏరియాలో సుమారు 2000 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం ఇవాళ శంకుస్థాపన చేశారు. అదానీ గ్రూపు చైర్మెన్ గౌతమ్ అదానీ, బెంగాల్ సీఎం సువేంధు అధికారి ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదానీ ఆరోగ్య మందిర్ భూమి పూజ కార్యక్రమంలో అదానీ భార్య, అదానీ ఫౌండేషన్ చైర్‌పర్సన్ ప్రీతీ అదానీ, కుమారుడు కరణ్ అదానీ కూడా ఈ ఈవెంట్‌కు హాజరయ్యారు. అదానీ ఆరోగ్య మందిర్‌కు సీఎం అధికారి భూమిపూజ చేశారు. న్యూ టౌన్‌లో ఉన్న యాక్షన్ ఏరియాలోని 51 ఎకరాల్లో ఆరోగ్య మందిర్‌ను నిర్మించనున్నారు. ఆస్పత్రిలో సగం బెడ్స్‌ను పేద పేషెంట్లకు కేటాయించనున్నట్లు సీఎం అధికారి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందు గౌతం అదానీ నగరంలోని కాళీఘాట్ ఆలయంలో పూజలు చేశారు. బెంగాల్‌లో లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు అదానీ తెలిపారు. 2035 నాటి కల్లా ఆ పెట్టుబడులు సాగనున్నట్లు చెప్పారు. పోర్టులు, లాజిస్టిక్స్, పవర్, రోడ్డులు, డేటా సెంటర్లలో ఇన్వెస్ట్‌మెంట్ ఉంటుందని గౌతమ్ అదానీ తెలిపారు. మల్టీ స్పెషాల్టీ ఆరోగ్య మందిర్ నిర్మాణం కోసం సుమారు 4వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. సుమారు 10వేల మందికి ఉద్యోగ ఉపాధి ఇవ్వనున్నారు.






## విజృంభించనున్న సూపర్ ఎల్‌నినో..

ప్రపంచవ్యాప్తంగా పేద దేశాల్లో 'సూపర్ ఎల్‌నినో'తో లక్షల సంఖ్యలో ప్రాణాలు పోవడం ఖాయమని క్లైమెట్ ఇంపాక్ట్ ల్యాబ్ నివేదిక హెచ్చరిస్తోంది. 2026 సెప్టెంబర్ నుంచి 2027 ఫిబ్రవరి మధ్యలో కనీసం 4.5 లక్షల మంది ఎండ వేడికి చనిపోయే అవకాశం ఉందని పేర్కొంది. భారత్‌లో కూడా వేల సంఖ్యలో మరణాలకు అవకాశాలున్నాయని నివేదిక వెల్లడించింది. సాధారణ రోజుల్లో.. సగటున ఎంతమంది చనిపోతారనే ముందుస్తు అంచనాకు ఇది అదనమని రిపోర్టు పేర్కొంది. 1996-2025ను బేస్‌లైన్‌గా తీసుకొని దీనిని తయారు చేశారు.

**భారీ మూల్యం చెల్లించుకొంటున్న పేద దేశాలు** : ప్రపంచ పేద దేశాలపై ఈ రిపోర్టు ఎక్కువ దృష్టి సారించింది. ఆఫ్రికాలోని 'సాహిల్ రీజియన్' (ఆఫ్రికా మధ్యలోని 9 దేశాల్లో ఐదువేల కిలోమీటర్లు విస్తరించిన ప్రాంతం)లో 66,800 మంది వేడిమి కారణంగా.. అదనంగా చనిపోవచ్చని వెల్లడించింది. వీటిల్లో 31,400 మరణాలు నైజీరియాలో, 17,500 మరణాలు సుడాన్‌లో, 10,000 మరణాలు నైజర్‌లో, 8,000 మరణాలు ఛాడ్‌లో నమోదు కావొచ్చని అంచనా వేసింది. ఇక ఆగ్నేయాసియాలో ఫిలిప్పీన్స్, వియత్నాం, థాయ్‌ల్యాండ్, కంబోడియాలో కలిపి సంయుక్తంగా 19,400 అదనపు మరణాలు నమోదు అయ్యే అవకాశం ఉంది. ఒక్క ఇండోనేసియాలోనే 19,300 మంది ప్రాణాలు కోల్పోతారని చెప్పింది. పెరిగిన ఉష్ణోగ్రతలు తట్టుకోలేక.. భారత్‌లో 15,800, బ్రెజిల్‌లో 13,300 మరణాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. భారత్, పాకిస్థాన్ దేశాల్లో రానున్న వేసవిలో కూడా మరణాలు నిలకడగా పెరిగే ప్రమాదం ఉందని నివేదిక పేర్కొంది. ప్రభుత్వాలు ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకునేలా తమ నివేదిక ఉపయోగపడుతుందని ది క్లైమెంట్ ఇంపాక్ట్ ల్యాబ్ వెల్లడించింది. ముందస్తుగా హీట్ వార్నింగ్స్ జారీ చేయడం, కూలింగ్ సెంటర్లు నిర్వహించడం, తాగునీటి సౌకర్యాలను పెంచడం, ఆరుబయట పనిచేసే ఉద్యోగులకు రక్షణ ఏర్పాట్లు కల్పించడం, ఆరోగ్య వ్యవస్థను సిద్ధం చేయడానికి ఈ అంచనాలు ఉపయోగపడనున్నాయి.

**2027లో కూడా వదలని ఎల్‌నినో..!** : ఇప్పటి వరకు ఎల్‌నినో పూర్తి స్థాయిలో ఏర్పడలేదు. సెప్టెంబర్ 3వ తేదీన ప్రపంచ వాతావరణ సంస్థ స్పందిస్తూ భవిష్యత్తులో ఎల్‌నినో మరింత బలపడుతుందని పేర్కొంది. దీని తీవ్రత నవంబర్, డిసెంబర్ నెలల్లో తారస్థాయికి చేరుతుందని అంచనావేసింది. 2027 ఫిబ్రవరిలో కూడా ఇది కొనసాగుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ భావిస్తోంది. భూమధ్య రేఖ వద్ద పసిఫిక్ సముద్రంలో ఉష్ణోగ్రత కూడా 1.8 డిగ్రీల సెల్సియస్ పెరిగొచ్చని ఇప్పటికే అమెరికా నేషనల్ ఓసియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడిం చింది. భూ ఉత్తరార్ధగోళంలో ఎల్‌నినో చాలా బలంగా ఉంటుందని ఈ సంస్థ వెల్లడించింది. 1901లో రికార్డుల నమోదు మొదలైన నాటి నుంచి.. ఈ ఏడాది ఆగస్టు నెల 'అత్యంత వేడిగా ఉన్న ఆగస్టు'గా నిలిచింది.

# పితృదేవతల పక్షం



ఒక తరం వెళ్లిపోతుంది. మరో తరం వస్తుంది. కానీ, మధ్యలో ఒక అదృశ్యమైన బంధం కొనసాగుతూనే ఉంటుంది. అదే స్మృతి. భారతీయ సంస్కృతి ఈ స్మృతికి ఒక ప్రత్యేక కాలాన్ని కేటాయించింది. అదే పితృపక్షం. మనిషి పుట్టిన రోజును గుర్తు చేసుకుంటారు. పెళ్లి రోజును గుర్తు చేసుకుని సంబురాలు జరుపుకొంటారు. పండుగలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. కానీ, తన ముందున్న తరాలను గుర్తు చేసుకోవడానికి ఒక ప్రత్యేకమైన పక్షాన్ని ఏర్పాటు చేసుకున్న అరుదైన సంస్కృతి మనది. భారతీయ సంప్రదాయ దృష్టి కోణంలో పితృపక్షం అనేది మరణించిన వారి కోసమే కాదు.. జీవించి ఉన్న మనిషి తన మూలాలను సంవత్సరానికి ఒకసారి గుర్తు చేసుకునే పర్వం.

'మహాన్ అత్యంత కొలయో యత్ర మహాలయ' అనేది పురాణోక్తి. మహాలయం అంటే ఘనమైన ముగింపు. భాద్రపద బహుళ పాడ్యమి నుంచి అమావాస్య వరకు ఉండే రోజులను పితృపక్షాలు లేదా మహాలయపక్షం అంటారు. మహాలయ పక్షంలోని అన్ని రోజుల్లో కానీ, ఒక్క మహాలయ అమావాస్య రోజున పూర్వీకులను గుర్తు చేసుకుంటూ వారికి పిండప్రదానం చేయడం ముఖ్యమైన విధిగా పాటిస్తారు. ఇది ఒక ఆచారంగా మాత్రమే చూడకుండా పితృపక్షాలలో చేసే క్రియల వెనక శాస్త్రీయత, మనస్తత్వశాస్త్రం, పర్యావరణ స్పృహ దాగి ఉన్నాయని గ్రహించాలి.

శ్రద్ధతో చేసేది శ్రాద్ధం. తప్పనిసరిగా తీర్చాల్సిన రుణాల్లో పితృణం ఒకటి. సూర్యుడు కన్యారాశిలో సంచరించే సమయంలో పితృదేవతలకు శ్రాద్ధ ప్రక్రియ నిర్వహించాలని స్కాంద పురాణంలోని నాగర ఖండం చెబుతున్నది. పితృపక్షాల ఆచారానికి వేల సంవత్సరాల చరిత్ర ఉన్నట్లు కొన్ని పురాణగాథలు చెబుతున్నాయి. మహాభారత యుద్ధం ముగిసిన తర్వాత కర్ణుడు స్వర్గానికి చేరుకున్నాడు. అక్కడ అతనికి తినడానికి ఆహారం బదులు బంగారం, నవరత్నాలు లభించాయి. దీనికి గల కారణాన్ని కర్ణుడు ఇంద్రుడిని అడగగా 'నీవు బతికి ఉన్నప్పుడు బంగారం రూపంలో చాలా దానాలు చేశావు కానీ, నీ పితృదేవతలకు ఎప్పుడూ అన్నం కానీ, నీరు కానీ సమర్పించలేద'న్నాడు.

తన తప్పును తెలుసుకున్న కర్ణుడు తన పితృదేవతలను సంతృప్తి పరచడానికి కొంత సమయం కావాలని ఇంద్రుణ్ని కోరుతాడు. ఆ కోరికను మన్నిస్తాడు ఇంద్రుడు. కర్ణుణ్ని భూలోకానికి పంపగా ఈ పితృపక్షాల సమయంలోనే అతను తన పూర్వీకులకు అన్నపానాదులు, తర్పణాలు సమర్పించినట్లు ఒక గాథ ప్రచారంలో ఉంది. పితృపక్షాల సమయంలో పితృదేవతలకు శాంతి కలిగించడం కోసం శ్రాద్ధం, తర్పణం, దానం అనే మూడు ప్రక్రియలను ఆచరించాలి. పూర్వీకులు మరణించిన తిథిని బట్టి ఆయా రోజుల్లో శ్రాద్ధం నిర్వహిస్తారు. ఒకవేళ తిథి తెలియకపోతే మహాలయ అమావాస్య రోజున అందరికీ కలిపి శ్రాద్ధం చేస్తారు. నదులు, చెరువులు, పుణ్యక్షేత్రాలలో నువ్వులు, నీటితో పితృదేవతలకు తర్పణం వదులుతారు. బియ్యప్పిండి లేదా ఉడికించిన అన్నంతో పిండప్రదానం చేయడం ఆనవాయితీ. కాకిని పితృదేవతల స్వరూపంగా భావించి వాటికి ఆహారాన్ని పెడతారు.

ఎందరో శాస్త్రవేత్తలు మహాలయపక్షాల ఆచారాలపై వివిధ కోణాల్లో పరిశోధనలు చేశారు. ఆధునిక సైన్స్ ప్రకారం మన శరీరం మన పూర్వీకుల డీఎన్‌ఏతో నిర్మితమైంది. మనం శారీరకంగా, మానసికంగా ఎలా ఉన్నామనేది మన పూర్వీకుల జన్యువులపై ఆధారపడి ఉంటుంది. పరిశోధకుల ప్రకారం పితృపక్షాలు మన ఉనికికి కారణమైన పూర్వీకుల డీఎన్‌ఏకు మనం చెప్పుకొనే ఒకరకమైన జన్యుపరమైన కృతజ్ఞతగా భావిస్తారు.

మరణించిన కుటుంబసభ్యులను తలచుకోవడం, వారి జ్ఞాపకాలను నెమరువేసుకోవడం ద్వారా మానసికంగా కొంత ప్రశాంతత లభిస్తుంది. గ్రీఫ్‌థెరపీలో భాగంగా ఈ ఆచారాలు పనిచేస్తాయి. పూర్వీకుల పట్ల తప్పులు చేసి ఉంటే వారిని క్షమాపణలు కోరడం, వారి మంచి పనులను గుర్తు చేసుకోవడం ద్వారా మానసిక అపరాధ భావన తొలగిపోతుందని మనస్తత్వ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ పదిహేను రోజుల్లో కాకులకు, పక్షులకు ఆహారం పెట్టడం తప్పనిసరి ఆచారం కావడం జీవ వైవిధ్య పరిశోధనల ప్రకారం వర్షాకాలం ముగిసి శీతాకాలం ప్రారంభమయ్యే సంధికాలంలో పక్షులకు సహజసిద్ధమైన ఆహారం దొరకడం కొద్దిగా తగ్గుతుంది. ఆ సమయంలో మనుషులు పెట్టే ఈ ఆహారం పక్షుల మనుగడకు ఎంతో సహకరిస్తుందని పర్యావరణ శాస్త్రవేత్తలు అంటున్నారు.

పితృపక్షాలు కేవలం సంప్రదాయ క్రతువులు మాత్రమే కాదు. వాటి వెనుక సమాజహితం, పర్యావరణ పరిరక్షణ, మానసిక ఆరోగ్యం వంటి శాస్త్రీయ కారణాలు కూడా దాగి ఉన్నాయి. మాతృదేవోభవ, పితృదేవోభవ అని నమ్మే భారతీయ సంస్కృతిలో వారు మరణించిన తర్వాత కూడా వారిపట్ల కృతజ్ఞతతో ఉండటమే ఈ పితృపక్షాల అసలైన అంతరార్థం. మహాలయపక్షంలో వారసులు సమర్పించే తర్పణాలతో పితృదేవతలు సంతోషించి వారి కుటుంబసభ్యులను ఆశీర్వదిస్తారని భారతీయులు విశ్వసిస్తారు. తరాలు మారినా, ఆధునిక విజ్ఞానం ఎంతగా మనతో మమేకమవుతున్నా ప్రతి ఒక్కరూ తమ మూలాలను మరవకూడదనే అద్భుతమైన సందేశాన్ని ఇచ్చేవే ఈ పితృపక్షాలు.

## డెంగ్యూ లక్షణాలుంటేనే చికిత్స



డెంగ్యూ జ్వర బాధితులు పెరుగుతున్నారు. వీళ్లలో పిల్లలే అధికంగా ఉన్నారు. ఇది దోమకాటు వల్ల వచ్చే వైరల్ ఇన్‌ఫెక్షన్. డెంగ్యూ కలిగించే వైరస్‌ని వ్యాప్తి చేసే దోమలు రాత్రి కన్నా పగటి వేళల్లో ఎక్కువగా కుడతాయి. డెంగ్యూ వైరస్ సోకితే మూడు నుంచి అయిదు రోజులు జ్వరం ఉంటుంది. కానీ, డెంగ్యూ లక్షణాలు వెంటనే బయటపడవు. జ్వరం తగ్గిన తర్వాత ఇబ్బందులుంటాయి. పొట్టనొప్పి, వాంతులు, ప్లేట్‌లెట్స్ తగ్గడం, తెల్ల రక్తకణాల తగ్గుదల, నీరసం, బీపీ తగ్గుదల, ముక్కు కారడం వంటి సమస్యలుంటాయి. డెంగ్యూ నిర్ధారణ కాగానే పేరెంట్స్ భయపడతారు. పిల్లల్ని హాస్పిటల్‌లో చేర్చాలా? అని అడుగుతారు. డెంగ్యూ సోకినవాళ్లలో తీవ్రత మూడు రకాలుగా ఉంటుంది. వైరస్ వల్ల డెంగ్యూ జ్వరం మాత్రమే ఉంటుంది. కొందరిలో జ్వరంతోపాటు డెంగ్యూ లక్షణాలు బయటపడతాయి. కొద్దిమందిలో డెంగ్యూ లక్షణాలు తీవ్రంగా ఉంటాయి. డెంగ్యూ లక్షణాలు బయట పడితేనే హాస్పిటల్‌లో చేర్చాలి. తీవ్రమైన కడుపు నొప్పి, వాంతులు, నీరసం, తక్కువగా తినడం, మూత్రం సరిగా పోకపోవడం, ఎక్కువ సమయం నిద్ర పోవడం, చేతులు చల్లబడటం వంటి సమస్యలు ఉంటే హాస్పిటల్‌లో చికిత్స చేయించాలి. డెంగ్యూ తీవ్రంగా ఉంటే ఐసీయూలో చికిత్స అవసరం ఉంటుంది. ఏడాదిలోపు పిల్లల్లో డెంగ్యూ లక్షణాలు తీవ్రంగా ఉంటాయి. వాళ్లకు డెంగ్యూ సోకిందని తెలియగానే హాస్పిటల్‌లో చేర్పించాలి.యాంటీ బయాటిక్స్‌తో డెంగ్యూని తగ్గించలేము. సెకండరీ ఇన్‌ఫెక్షన్లు ఉంటే యాంటీ బయాటిక్స్ ఇస్తారు. లక్షణాలను బట్టి మందులు, ఫ్లూయిడ్స్ ఇస్తారు. డెంగ్యూ వచ్చిన వాళ్లందరికీ ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సిన అవసరం లేదు. ప్లేట్‌లెట్స్‌ని మందులతో పెంచలేము. ప్లేట్స్‌లెట్స్ ఎక్కించాల్సిన అవసరం ఉన్న స్థితిని వైద్యులే నిర్ణయించి చికిత్స చేస్తారు. డెంగ్యూ ఇంట్లో ఇకరికి వస్తే వారి నుంచి మరొకరికి వస్తుందనుకుంటారు. అదంతా ఒక అపోహ. కేవలం దోమకాటు ద్వారానే సోకుతుంది. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటే ఈ సీజన్‌లో డెంగ్యూ బారినపడకుండా పిల్లల్ని కాపాడుకోవచ్చు.

# గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ బడా గణేశుడు



హైదరాబాద్: ఖైరతాబాద్ బడా గణేశుడు గంగమ్మ ఒడికి చేరాడు. ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబర్ 4 వద్ద నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. ఈ ఏడాది 69 అడుగుల 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా గణనాథుడు దర్శనమిచ్చాడు. శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో ఖైరతాబాద్ నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా ఈ శోభాయాత్ర కొనసాగింది. ఆ తర్వాత ఎన్టీఆర్ మార్గ్ వద్దకు చేరుకున్న బడా గణేశుడికి ఉత్సవ కమిటీ ప్రత్యేక పూజలు నిర్వహించింది. అనంతరం మధ్యాహ్నం 2.15 గంటలకు హుస్సేన్‌సాగర్‌లో భారీ క్రేన్ల సాయంతో నిమజ్జన ప్రక్రియను పూర్తిచేశారు. ఖైరతాబాద్ నుంచి ఎన్టీఆర్ మార్గ్ వరకు భక్తుల జయజయధ్వానాల నడుమ బడా గణేశుడి శోభాయాత్ర కనుల పండువగా కొనసాగింది. వేలాదిమంది భక్తులు వీడ్కోలు పలుకుతుండగా గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. బడా గణేశుడి నిమజ్జనోత్సవాన్ని వీక్షించేందుకు వేలాదిగా భక్తులు ట్యాంక్‌బండ్ వద్దకు తరలివచ్చారు. గణపతి బప్పా మోరియా నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. శోభాయాత్ర ప్రారంభ సమయంలో దానం నాగేందర్ మహాగణపతి ఎదుట డ్యాన్స్ చేశారు.






EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY SHAIK ABDUL GOUSE ALI, PRINTED AT USHASRI PRINTERS, 22-12-84, VOORAVARI STREET, LALAPET, GUNTUR DISTRICT. ANDHRAPRADESH.
PUBLISHED AT MAHANATI SAVITHRI ROAD, BESIDES SARADHA, GRANDHALAYAM, SATTENAPALLI-522403, GUNTUR DISTRICT. ANDHRAPRADESH. EDITOR: SHAIK ABDUL GOUSE ALI.